

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 3 | ది. 30-3-2026 | సోమవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 3 | Date : 30-3-2026 | Monday | Pages : 8 | Rs.1/- |


## క్రీడా విప్లవం నుంచి ప్రపంచ సంక్షోభం వరకు.....

# మాన్ కీ బాత్ 132వ ఎపిసోడ్ లో ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ,మార్చి 29 (వార్తాప్రభ) :** నరేంద్ర మోడీ భారత ప్రధానిగా భాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతి నెల చివరి ఆదివారం మన్ కీ బాత్ ద్వారా ప్రజలకు సందేశం ఇస్తున్న విషయం తెలిసిందే. రేడియో ద్వారా వచ్చే ఈ సందేశం కోసం దేశవ్యాప్తంగా ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. ఈ క్రమంలో నేడు మన్ కీ బాత్ 132 వ ఎపిసోడ్ లో భాగంగా ప్రధాని మోడీ క్రీడా విప్లవం నుంచి ప్రపంచ సంక్షోభం వరకు పలు కీలక అంశాలపై సందేశం ఇచ్చారు.

**జమ్మూ కాశ్మీర్ క్రీడా స్ఫూర్తి"..** జమ్మూ కాశ్మీర్ ప్రజలకు క్రీడల పట్ల ఎప్పుడు అమితమైన ఆసక్తి ఉంటుంది. ఇప్పుడు ఈ ప్రాంతం పెద్ద క్రీడా ఈవెంట్‌లకు కేంద్రంగా మారుతున్నందుకు నాకు సంతోషంగా ఉంది. 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్' ద్వారా గుల్మార్గ్ ఇప్పటికే తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడి యువతలో ఫుట్‌బాల్ వంటి క్రీడలు కూడా బాగా ప్రాచుర్యం పొందాయి. రానున్న రోజుల్లో కూడా జమ్మూ కాశ్మీర్ విజయ పరంపర ఇలాగే కొనసాగుతుందని ఆశిస్తున్నానని ప్రధాని చెప్పుకొచ్చారు.

**మహిళా క్రీడాకారిణుల ముందంజ..** "నేను తరచూ చెబుతుంటాను-ఎవరు ఆడతారో వారే అభివృద్ధి చెందుతారు . దేశ యువత గతంలో ప్రాచుర్యం లేని క్రీడలను కూడా ఇప్పుడు ఎంచుకోవడం చూస్తుంటే నాకు ఆనందంగా ఉంది. 'అస్మిత అథ్లెటిక్స్ లీగ్' గురించి కూడా నాకు సమాచారం అందింది. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీని కింద అనేక క్రీడా పోటీలు నిర్వహించారు. దేశంలో జరుగుతున్న ఈ క్రీడా పరివర్తనలో భారతీయ మహిళలు కీలక పాత్ర పోషించడం చూడటం చాలా బాగుందని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు.

**రంజీ ట్రోఫీలో జమ్మూ కాశ్మీర్ చారిత్రక విజయం..** "గత నెల చివరలో కర్ణాటకలోని హుబ్బళ్ళిలో ఒక ఆసక్తికరమైన మ్యాచ్ జరిగింది. అందులో జమ్మూ కాశ్మీర్ క్రికెట్ జట్టు 'రంజీ ట్రోఫీ'ని గెలుచుకుంది. అత్యంత సంతోషకరమైన విషయం ఏమిటంటే, ఏడు దశాబ్దాల నిరీక్షణ తర్వాత ఈ జట్టు తన మొదటి రంజీ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ అపూర్వ విజయం ఆటగాళ్ల ఏళ్ల తరబడి నిరంతర కృషి ఫలితం. టీమ్ కెప్టెన్ పారస్ డోగ్రా అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. రంజీ సీజన్‌లో 60 వికెట్లు తీసిన యువ కాశ్మీరీ బౌలర్ ఆకిబ్ నబీ ప్రదర్శన గురించి కూడా దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ విజయం అక్కడ మరికొంత మంది యువతను క్రీడల వైపు మళ్లేలా స్ఫూర్తినిస్తుందన్నారు."

**టీ20 ప్రపంచకప్ విజయం..** "ఈ మార్చి నెల దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. టీ20 ప్రపంచకప్‌లో భారత్ సాధించిన చారిత్రక విజయం దేశమంతటా ఆనందాన్ని నింపింది. మన జట్టు సాధించిన ఈ అసాధారణ విజయాన్ని చూసి మనమందరం గర్విస్తున్నాం."

**మేరా యువ భారత్..** "భారతదేశం ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కులు ఉన్న దేశం. దేశ యువశక్తిని దేశ నిర్మాణానికి వినియోగించినప్పుడు, అది అపారమైన మద్దతును ఇస్తుంది. ఈ దేశ నిర్మాణ బాధ్యతను నెరవేర్చడంలో 'మేరా యువ భారత్' సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సంస్థ దేశ యువతను వివిధ సానుకూల పరిణామాలతో అనుసంధానం చేస్తుంది."

**జ్ఞాన భారతం సర్వే - రాతప్రతులు సేకరణ..** "దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ప్రజా భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించే 'జ్ఞాన భారతం సర్వే' గురించి నేను ఇప్పుడు చెప్పాలనుకుంటున్నాను. ఇది మన గొప్ప సంస్కృతి మరియు వారసత్వానికి సంబంధించినది. దేశవ్యాప్తంగా ఉన్న పురాతన రాతప్రతుల సమాచారాన్ని సేకరించడమే దీని లక్ష్యం. మీరు 'జ్ఞాన భారతం యాప్' ద్వారా ఈ సర్వేలో చేరవచ్చు. మీ వద్ద ఏదైనా రాతప్రతి ఉన్నా లేదా దాని గురించి సమాచారం ఉన్నా ఆ ఫోటోను యాప్‌లో షేర్ చేయండి. ప్రతి ఎంట్రీని రికార్డ్ చేసే ముందు ధృవీకరించడం జరుగుతుంది."

**సంక్షోభాలను అధిగమించే శక్తి..** "గతంలో మనం అనేక సంక్షోభాలను ఎలాగైతే అధిగమించామో, అదే విధంగా 140 కోట్ల మంది పౌరుల సామూహిక శక్తితో ఈసారి కూడా కష్టతరమైన పరిస్థితుల నుండి విజయవంతంగా బయటపడతామని నేను నమ్ముతున్నానని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు.

**వదంతులు నమ్మవద్దు - రాజకీయం చేయొద్దు..** "యుద్ధం కారణంగా ఏర్పడిన పలు నిత్యావసరాల కొరత అంశాన్ని రాజకీయం చేస్తున్న వారందరూ అలా చేయకూడదని నేను కోరుతున్నాను. ఇది 140 కోట్ల మంది ప్రయోజనాలకు సంబంధించిన విషయం. ఇందులో స్వార్ధ రాజకీయాలకు చోటు లేదు. వదంతులు వ్యాప్తి చేసేవారు దేశానికి గొప్ప హాని చేస్తున్నారు. పుకార్లను నమ్మి తప్పుదోవ పట్టవద్దని దేశప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రభుత్వం నిరంతరం సమాచారాన్ని అందిస్తుంది, దానిని మాత్రమే నమ్మండని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని విజజప్తి చేశారు.

**ప్రపంచ దేశాల సహకారం..** "అంతర్జాతీయ సంబంధాలు, గత దశాబ్ద కాలంలో మనం నిర్మించుకున్న సామర్థ్యం కారణంగానే భారత్ ఈ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలుగుతోంది. ఇది నిశ్చయంగా సవాళ్లతో కూడిన సమయం.


# 'సొంతింటి' సంతోషం

## ● మలివిడతగా 2.5 లక్షల గృహ ప్రవేశాలు

- రేపు సూళ్లూరుపేటలో ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- 21 నెలల్లో 5.50 లక్షల మంది పేదలకు ఇళ్ల అందజేత
- తిరుపతిలో పీ4 వార్షికోత్సవంలో పాల్గొననున్న సీఎం










**అమరావతి,మార్చి 29 (వార్తాప్రభ) :** ప్రతీ ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తోన్న ప్రజాప్రభుత్వం మరోసారి సామూహిక గృహప్రవేశాల ద్వారా పేదలకు ఇళ్ల పంపిణీ చేపట్టనుంది. రెండో విడత ఇళ్ల పంపిణీలో భాగంగా రేపు రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 2.5 లక్షల గృహ ప్రవేశాలను ఘనంగా నిర్వహించనుంది. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలో సోమవారం జరిగే సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తారు.

**21 నెలలు... 5.50 లక్షల ఇళ్లు..** కూటమి అధికారంలోకి వచ్చాక ఈ 21 నెలలో రెండోసారి ప్రభుత్వం ఇళ్ల పంపిణీ చేస్తోంది. గతేడాది నవంబర్‌లో రాయచోటి నుంచి 3 లక్షల ఇళ్లను రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు అప్పగించింది. రెండో విడతలో భాగంగా సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడపేట మండలం, పుదూరు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 1 లక్ష టిడ్కో ఇళ్లతో పాటు మరో 1.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమం అనంతరం పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం మొదలుపెట్టి ఏడాదవుతున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహించే వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు..** ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11.50 గంటలకు పుదూరుకు చేరుకుంటారు. 11.55 గంటలకు లబ్ధిదారులతో టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాలు చేయిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముచ్చటిస్తారు. 12.40 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొంటారు. 02.40 గంటలకు సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం తర్వాత సాయంత్రం 04.35 గంటలకు తిరుపతి చేరుకుంటారు. 04.45 గంటలకు శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించే పీ4 వార్షికోత్సవ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగించుకుని రాత్రి 08.50 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# కూటమి స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దాం

### -టీడీపీ శ్రేణులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



**అమరావతి,మార్చి 29 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పార్టీ శ్రేణులందరికీ ఆయన తన అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ఐక్యత అత్యంత కీలకమని, ఈ స్ఫూర్తిని మరింత బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. దివంగత నందమూరి తారక రామారావు 'తెలుగువారి ఆత్మ గౌరవం' అనే నినాదంతో స్థాపించిన తెలుగుదేశం పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక సంచలనం సృష్టించిందని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో బలంగా నిలబడటం వెనుక గొప్ప పోరాట చరిత్ర ఉందని అన్నారు. పార్టీ ప్రస్థానంలో ఎదురైన ఎన్నో క్లిష్ట పరిస్థితులను, ఒడిదుడుకులను చంద్రబాబు తన అపారమైన రాజకీయ అనుభవంతో అధిగమించారని కొనియాడారు. ఆయన నాయకత్వ పటిమ పార్టీ శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపిందని ప్రశంసించారు.

# స్వచ్ఛంద రక్తదానంకు ముందుకు రావాలి

### -సేవాభారతి డా. హెడ్గేవార్ బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల



**హైదరాబాద్,మార్చి 29 (వార్తాప్రభ) :** సేవాభారతి డా. హెడ్గేవార్ బ్లడ్ బ్యాంక్‌ను తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ఆదివారం హైదరాబాద్ కోటి క్లాక్ టవర్ సమీపంలోని వైఎంఐఎస్ గ్రంథాలయ భవనంలో ప్రారంభించారు. పేద ప్రజలకు సేవ చేయడం, అత్యవసర రక్త అవసరాలను తీర్చడం లక్ష్యంగా ఈ దాతృత్వ బ్లడ్ బ్యాంక్ స్థాపించబడింది. సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఆరోగ్య సేవలను అందించడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యాకారిణి సభ్యులు సుహాస్ రావు హిరేమత్, రాష్ట్రీయ సేవాభారతి అధ్యక్షులు సునీల్ సప్రే, అఖిల భారతీయ ధర్మ జాగరణ ప్రముఖ్ అలే శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి జాతీయ భద్రతా సలహా మండలి సభ్యుడు, మాజీ డీఆర్‌డీఓ చైర్మన్ డా. జి. సతీష్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు దీపప్రజ్వలన చేసి బ్లడ్ బ్యాంక్ కార్యకలాపాలను అధికారికంగా ప్రారంభించారు. సభలో ప్రసంగించిన వక్తలు స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతను వివరించి, సమాజ ఆధారిత ఆరోగ్య సేవా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సమయానికి సురక్షిత రక్తం అందుబాటులో ఉండటం ప్రాణాలను రక్షించగలదని, ముఖ్యంగా యువత రక్తదాన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రక్తదానం అనేది మనిషి నుండి మరొక మనిషికి జీవం ప్రవహించే అత్యంత పవిత్రమైన దానం అని పేర్కొన్నారు. ఇటీవలి ప్రజా ఆరోగ్య సవాళ్లను ప్రస్తావిస్తూ, వ్యాధి ఒక సమస్య అయితే, వైద్య సేవల అందుబాటు లోపమే మరింత పెద్ద సమస్యగా నిలిచిందని తెలిపారు.




## శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము

పెనుగంచిప్రోలు, ఎన్‌టీఆర్ జిల్లా

**కంప్యూటర్ నెం. తేది : 2026/112424 29.03.2026**

### బహిరంగ వేలం ప్రకటన

ఈ క్రింది తెలియపరచిన శ్రీ అమ్మవారి హక్కు భుక్తములో గల భూములకు సర్వే నెంబర్లులలో భూముల కౌలు నిమిత్తం 2026-2027 నుండి 2028-2029 వరకు సంబంధించి ది.13.4.2026 ఉదయం 11.00 గంటలకు బేడా మండపం నందు సీల్డ్ టెండర్-కం బహిరంగ వేలము - నిర్వహించుటకు నిర్ణయించడమైనది.

| వ. నెం. | సర్వే నెం. | గ్రామము | విస్తీర్ణము య. సెంట్లు | మెరక/పల్లం | ధరావత్తు సొమ్ము |
|---|---|---|---|---|---|
| 1) | 697/1, 697/8 | పెనుగంచిప్రోలు | 5.09 | మాగాణి | 25,000/- |
| 2) | 697/6 | పెనుగంచిప్రోలు | 2.00 | మాగాణి | 20,000/- |
| 3) | 50 | పెనుగంచిప్రోలు | 12.39 | మాగాణి | 50,000/- |
| 4) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 5.20 | మెరక | 25,000/- |
| 5) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 6.33 | మెరక | 25,000/- |
| 6) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 3.00 | మెరక | 25,000/- |
| 7) | 2/1,2/3A | సుబ్బాయి గూడెం | 3.00 | మెరక | 25,000/- |
| 8) | 646 | సుబ్బాయి గూడెం | 10.88 | మాగాణి | 50,000/- |

నెం.1 నుండి 8 వరకు ఉన్న సర్వే నెంబరు హక్కులకు సీల్డ్ టెండర్-కం బహిరంగ వేలము సంబందించి 8 నెంబర్లు భూముల కౌలు హక్కులకు సీల్డ్ టెండర్ - కం బహిరంగ వేలము నిర్వహించుట జరుగును. కావున పై భూముల కౌలు హక్కులకు సంబందించి ఇతర వివరముల కొరకు 9441471445, 8008192588 లను సంప్రదించగలరు.

శ్రీ అమ్మవారి సేవలో

సం/- బి.మహేశ్వరరెడ్డి
ఉప కమీషనరు మరియు
కార్యనిర్వహణాధికారి



## గ్రామ పంచాయితీ కార్యాలయం, పెనుగంచిప్రోలు

పెనుగంచిప్రోలు మండలం, ఎన్టీఆర్ జిల్లా

### టెండర్ నోటీసు

రె.క.నెం.10/2025-26 తేది : 29-03-2026

ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు మండలం, పెనుగంచిప్రోలు గ్రామ పంచాయితీ పరిదిలో 2026-27వ సంవత్సరమునకు అనగా ది. 01-04-2026 నుండి 31-03-2027 వరకు ఈ క్రింది షెడ్యూలు ధాఖలు పనులు నిర్వహించుటకు గాను 43 మంది వ్యక్తుల సేవలు కాంట్రాక్ట్ పద్ధతిపై వినియోగించుకొనుటకు గాను ది.31.03.2026న మధ్యాహ్నం గం.2.00ల వరకు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేదా అనుమతి పొందిన వారిచే సీల్డ్ టెండర్లు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం గం.04.00లకు హాజరైన టెండరు దాఖల సమక్షములో సీల్డ్ టెండర్ తెరవబడును. ఇతర వివరములను షరతులకు ఈ కార్యాలయము పని వేళల యందు తెలుసుకొనగలరు.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుధ్య పనుల నిర్వహణ, మంచినీటి సరఫరా నిర్వహణ మరియు వీధి దీపముల రిపేరు పనులు నిర్వహించుటకు -43 మంది (Multi Purpose) వ్యక్తుల సేవలు | 01.04.2026 నుంచి 31.03.2027 వరకు | రూ.5,000/- |

గమనిక : 1. గ్రామ పంచాయితీ ఆర్థిక పరిస్థితిని బట్టి పేమెంట్ చేయబడను.

సం/- శ్రీమతి వేల్పుల పద్మకుమారి
సర్పంచ్
గ్రామ పంచాయితీ,పెనుగంచిప్రోలు

సం/- శ్రీ జి.శ్యాం కుమార్
కార్యదర్శి
గ్రామ పంచాయితీ,పెనుగంచిప్రోలు


# ఏపీ అభివృద్ధికి జర్నలిస్టులు సహకరించాలి

- రాజకీయ పార్టీలకు మీడియా సంస్థలు ఉండడం సమాజానికి చేటు
- 2024 తర్వాత ఏపీలో మీడియాకు మాట్లాడే స్వేచ్ఛ వచ్చింది
- జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**విజయవాడ,మార్చి 29 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు కనీసం మాట్లాడే స్వేచ్ఛ కూడా లేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీలో మీడియాకు ప్రశ్నించే స్వేచ్ఛ, మాట్లాడే స్వేచ్ఛను కల్పించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గతంతో పోల్చుకుంటే మీడియాలో విలువలు వేగంగా పడిపోతున్నాయని... విలువల పునరుద్ధరణ జరిగేలా చూడాలని జర్నలిస్టులను సీఎం కోరారు. రాజకీయ పార్టీలకు సొంత మీడియా ఉండటం ప్రమాదానికి దారితీస్తోందని అన్నారు. తమది జర్నలిస్ట్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి శక్తి మేరకు కృషి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రికి ఐజేయూ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. సీనియర్ జర్నలిస్టులను సీఎం అప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విజయవాడలో ఐజేయూ 11వ ప్లీనరీని జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఆనాడు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు హైదరాబాద్ లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పుడు ఫలితాలు కనిపిస్తున్నాయని ఐజేయూ ప్రతినిధులు చెప్పడం సంతోషంగా ఉంది. ప్రస్తుత కాలంలో జర్నలిజం బాగా మారిపోయింది. మీడియా విపరీత పోకడలు సమాజానికి మంచిది కాదు. అలవోకగా అబద్ధాలను చిత్రీకరిస్తున్నారు. మీడియాలో విలువలు, సిద్ధాంతాలు పడిపోతున్నాయి.

# ఆయుర్వేద హాస్పిటల్ ప్రక్కనే ఆయుర్వేద కళాశాల నిర్మించాలి

## -ఎస్విఎస్ కన్స్ట్రక్షన్ పేరుతో ఇచ్చిన జిఓ రద్దు చేయాలని సిపిఎం డిమాండ్





**కాకినాడ,మార్చి 29 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను ఆనుకుని నిర్మించిన ఆయుర్వేద కళాశాల ప్రక్కనే ఆయుర్వేద హాస్పిటల్ నిర్మించాలని, ఎస్విఎస్ కన్స్ట్రక్షన్ పేరుతో ఇచ్చిన జిఓ రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆదివారం సిపిఎం బృందం ఆయుర్వేద హాస్పిటల్ నిర్మించిన పరిసర ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను సంతృప్తి పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం జిఓ. నెం. 17 విడుదల చేసి కోట్ల విలువ చేసే భూమి దారాదత్తం చేయాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ పదవిని డిప్యూటీ సీఎం పవన్ సోదరుడు నాగబాబుకి కట్టబెట్టడం వల్ల వర్మ అసంతృప్తిని చల్లార్చడానికి ఈ విధంగా ప్రజల ఆస్తిని కట్టబెట్టడం శోచనీయమన్నారు. తక్షణమే జిఓ. నెంబర్ 17 ( మార్చి 16, 2026) రద్దు చేయకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ కాకినాడలో ఆయుర్వేద హాస్పిటల్ నిర్మించడం అభినందనీయమన్నారు. అయితే హాస్పిటల్ ప్రక్కనే ఆయుర్వేద కళాశాల ఉండాలన్నారు. ప్రస్తుతం ఆయుర్వేద కళాశాల పిఠాపురంలో మంజూరైందని ప్రక్కదోవ పట్టించడం సరికాదన్నారు. నిర్మాణం పూర్తయిన ఆయుర్వేద హాస్పిటల్ ప్రారంభించకపోతే ప్రజా ధనం వృధా అయ్యే పరిస్థితి వస్తుందన్నారు. అదేవిధంగా టూరిజం అభివృద్ధి పేరుతో గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఎన్టిఆర్ బీచ్ పార్క్, రిసార్ట్స్, అతిథి గృహం నిర్మించారని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నిర్మాణాలు శిధిలావస్థకి వస్తున్నాయన్నారు. టూరిజం అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే బీచ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. గత వైసీపీ పాలనలో భూముల దారాదత్తంపై విమర్శలు చేసిన అధికార పార్టీ పెద్దలు మీరు చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు. ఎస్విఎస్ కన్స్ట్రక్షన్ పేరుతో ఇచ్చిన జిఓ రద్దు చేయాలని, ఆయుర్వేద కళాశాల కాకినాడలో ఆయుర్వేద హాస్పిటల్ ప్రక్కనే నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. సిపిఎం బృందం పర్యటన సమయంలో ఆయుర్వేద హాస్పిటల్ ప్రక్కనే రెండు జెసిబిలతో చెట్లు తొలగించడం గమనించామన్నారు. దీనిపై సంబంధిత అధికారులు ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వ శేషబాబ్జితో పాటు నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సభ్యులు మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె నాగజ్యోతి, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగోడి ఆత్మగౌరవం నుంచి టీడీపీ పుట్టింది- టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల



**కాకినాడ, మార్చి 29 (వార్తాప్రభ) :** తెలుగోడి ఆత్మగౌరవం నుండి తెలుగుదేశం పార్టీ పుట్టిందని దానికి కార్మిక, కర్షక, రైతు, మహిళలందరూ కలిసి సంచలన విజయానికి సహకరించారని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం కాకినాడలో జిల్లా టీడీపీ కార్యాలయంలో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షత వహించి ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో ఉన్న పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీ రామారావు నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు చిక్కాల రామచంద్రరావు, రాజ్యసభ సభ్యులు సతీష్ బాబు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, పార్టీ నాయకులు గుణ్ణం చంద్రమౌళి, రామదేవు సీతయ్య దొర, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నాడు అన్న నందమూరి తారకరామారావు తెలుగువారి ఆత్మగౌరవాన్ని యావత్ ప్రపంచంలో దశదిశల వ్యాప్తి చెందేలా చేసిన మహోన్నత వ్యక్తి రామారావు అని అన్నారు. ఆనాడు ఎన్టీఆర్ పెట్టిన పథకాలే ఇప్పటికీ అమలు చేయడం యావత్ దేశంలోనే ఒక రికార్డుగా నిలిచిందన్నారు. పార్టీకి కార్యకర్తలే బలమని, తెలుగుదేశం మహిళా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా వారి అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిందని చెప్పారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గాడిలో పెట్టిన ఘనత ఎన్టీఆర్ ఘనతని బహుజనానంతర కాలంలో ఆంధ్రప్రదేశ్ కు శిల్పిగా మారి రాజధాని నిర్మాణంలో అహర్నిశలు కృషి చేస్తున్న మహోన్నత వ్యక్తి సీఎం చంద్రబాబని కొనియాడారు. తెలుగుదేశం పార్టీలో కెసిఆర్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ రాష్ట్రంలో సీఎం అవ్వడానికి తెలుగుదేశం క్రమశిక్షణ ఒక కారణమన్నారు. అంతకు ముందు జిల్లా పరిషత్ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ నిలువెత్తు దగ్గర పూలమాలలు వేసి నివాళులర్పించి టీడీపీ కార్యాలయానికి బయలుదేరి వచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, వి బద్రి, సుంకర పావని, వివై దాసు, సరిపెల్ల రాజేష్, బోళ్ల కృష్ణమోహన్, కోర్పు సాయి తేజ, జహీరుద్దీన్ జిలాని, నులుకుర్తి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# విస్సన్నపేట మండల అధ్యక్ష పీఠం ఎక్కనున్న తొలి ఓసీ మహిళ



**విస్సన్నపేట,మార్చి 29 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ చరిత్రలో తొలిసారి ఓసి మహిళ ఎంపీపీగా పరిపాలన చేయనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం అందుతుంది. 20 11 లెక్కల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలోని విస్సన్నపేట మండలం మొత్తం జనాభా 59 7 98 కాగా ఇందులో పురుషులు స్త్రీలు దాదాపు సమాన నిష్పత్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాన పట్టణమైన విస్సన్నపేట జనాభా 17852 కాగా 78 శాతం అక్షరాస్యత ఉన్నట్లు కణాంకాలు చెప్పుతున్నాయి మండల విస్తీర్ణం 192 చదరపు కిలోమీటర్లు గా నమోదయింది. మండలంలో పుట్రెల గ్రామం రెండవ అతి పెద్ద గ్రామ పంచాయతీగా ఉన్నది. తెల్లదేవరపల్లి చంద్రుపట్ల, చశీద్రుపట్ల ఎల్టి , కొండ పర్వ, తాత కుంట్ల, నరసాపురం, కలగర కొర్లమండ వేమిరెడ్డిపల్లి, మారేమండ తదితర గ్రామపంచాయతీలు ఉండగా మారేమండ , నరసాపురం, తెల్ల దేవరపల్లి గ్రామపంచాయతీలు మూడు టిడిపి ఖాతాలో విజయం సాధించగా మిగిలిన గ్రామపంచాయతీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనవిజయం సాధించాయి. ఐదు సంవత్సరాల క్రితం గెలుపు ఓటముల లెక్కలు ఆ విధంగా ఉండగా 20 24 అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి టిడిపి పార్టీ మండలంలో మెజార్టీ ఓట్లు సాధించింది. విసన్నపేట మండల సింహాసనం పై ఎస్సీ,ఎస్టీ , మహిళలు ఎంపీపీగా రిజర్వేషన్ పద్ధతిలో సేవలు అందించడం జరిగింది. వారిలో ఒకరు కాంగ్రెస్ మరి ఒకరు వై ఎస్ ఆర్ సి పి కావటం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. స్వాతంత్ర్యం సమపాధించిన సమయము నుండి విస్సన్నపేట సమితి స్థాయి నుండి 19 83 సంవత్సర టిడిపి పరిపాలన సమయంలో ఏర్పాటైన ప్రస్తుత మండల ప్రజా పరిషత్తు చరిత్ర వరకు గడచిన కాలంలో ఎక్కువ కాలం కాంగ్రెస్ పార్టీ పరిపాలించగా ద్వితీయ స్థానం వైఎస్ఆర్సిపి ఉన్నది అని చెప్పవచ్చు. టిడిపి ఎంపీపీలుగా దివంగత మాగంటి కృష్ణమోహన్, ముత్తంశెట్టి వెంకటేశ్వరరావులు సేవలు అందించగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున రెండు పర్యాయాలు పార్టీ విజయం సాధించగా మొదటిసారి ఎస్టీ మహిళ రిజర్వేషన్ కావడంతో భూక్య రాణి ని పుట్రెల ఓసి సెగ్మెంట్ నందు వైసిపి సీనియర్ నాయకులు ప్రస్తుత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి ఆయన రాజకీయ చాణక్యతతో గెలిపించి ఎంపీపీ సీటుపై కూర్చోబెట్టడం జరిగింది. తర్వాత రెండవసారి వైసిపి ఎస్సీ జనరల్ రిజర్వేషన్ తో సాధించిన విజయంతో ఆనాటి తిరువూరు శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణ నిధి, పార్టీ పెద్దలతో మాట్లాడి మహిళా ఎంపీటీసీ పిల్లి మెరిసి వనజాక్షిరాజేష్ ను ఎంపీపీ సీట్ కు సిఫారసు చేయడం జరిగింది. ఇటీవల కాలంలో ఆమె రాజీనామా చేయడంతో జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్, తిరువూరు నియోజవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నల్లగట్ల స్వామి దాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు తదితరుల చర్చల అనంతరం జిల్లా నాయకత్వం ఆదేశాలతో ఎంపీటీసీ గద్దల మల్లయ్య ను పూర్తి మెజార్టీ ఉన్న వైసిపి అధికారిక మార్గంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గతంలో తొలి మహిళా ఎంపీపీ గా కాంగ్రెస్ పరిపాలనలో పుట్రెల గ్రామానికి చెందిన కొలిక పోగు ప్రేమలత ఎస్సీ మహిళా రిజర్వేషన్ ద్వారా ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేసి ఆమె పరిపాలన సాగించారు. బీసీ మహిళ, ఓసి మహిళా రిజర్వేషన్లు ఇప్పటివరకు రాలేదని ఓసి మహిళా రిజర్వేషన్ ద్వారా రాబోయే మండల ప్రజా పరిషత్ ఎన్నికలలో ఎంపీపీగా అడుగుపెట్టే అవకాశం ఉంటుందని రాజకీయ మేధావులు అనుకుంటున్నారు.

# తెలుగు ప్రజల చరిత్రను తిరగరాసిన మహనీయుడు "ఎన్.టి.ఆర్."

## -రంగన్నగూడెంలో ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**హనుమాన్ జంక్షన్, మార్చి 29 (వార్తాప్రభ) :** 44 ఏళ్ళ క్రితం తెలుగుదేశం పార్టీ స్థాపించి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి తెలుగు ప్రజల చరిత్రను సుసంపన్నం చేసిన మహనీయుడు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.టి.ఆర్.అని టి.డి.పి. సీనియర్ నేత ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరోజు ఉదయం గ్రామ కూడలిలోని ఎన్.టి.ఆర్. విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లగాని వీరాంజనేయులు తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు.



# ఘనంగా తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం



**గన్నవరం,మార్చి 29 (వార్తాప్రభ) :** గన్నవరం మండలం, చిక్కవరం గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మణిమాల వెంకట అప్పారావు ఆధ్వర్యం లో తెలుగు దేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామ టిడిపి నాయకులు కేకు కట్ చేసి, స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. చంద్రబాబు , లోకేష్ యార్లగడ్డ , న్యాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేసి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగాలిగ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మణిమాల వెంకట అప్పారావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు ఏర్పాటు చేసినపార్టీ నీ చంద్రబాబు విజనరీ నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాదును ప్రపంచం తొంగి చూసే విధంగా అభివృద్ధి చేశారన్నారు యువ నాయకుడు నారా లోకేష్ బాబు అమరావతిని ప్రపంచంలోనే నెంబర్ వన్ గా చేస్తారనీ,మన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు గత 25 సంవత్సరాలలో జరగని అభివృద్ధి కేవలం రెండు సంవత్సరాల్లో చేసి చూపిన ఘనత యార్లగడ్డ వెంకట్రావు దే అని కొనియాడారు.గన్నవరాన్ని ఒక మోడల్ సిటీ గా తయారు చేస్తారు అని చెప్పారు. లిచిక్కవరం రైతు విభాగం అధ్యక్షుడు ముక్కామల రామచంద్రరావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు 1982మార్చి 29నా హైదరాబాద్ లో తెలుగుదేశం పార్టీనీ స్థాపించారు . కూడు , గూడు, గుడ్డ ,నీరు, నీడ, అనే సిద్ధాంతాలుతో పార్టీ స్థాపించిన 9నేలలు కే ప్రభుత్వం ఏర్పాటు చేసి పేదలకు రెండు రూయపాలకే కిలో బియ్యం, పేదలకు సొంత ఇళ్లు, ఆడపిల్లలకు ఆస్తి హక్కు ఇలాంటి చాలా పథకాలు అమలు చేశారన్నారు. గ్రామ టీడీపీ పార్టీ నాయకుడు చిట్టినేని జోజి బాబు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు అనంతరం1995 నుంచి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యం లో తెలుగు వారి ఆత్మగౌరవం పేద ప్రజల సంక్షేమంతో పార్టీ నీ బలోపేతం చేశారనీ, టిడిపి హయాంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పదంలో నడిపించారు అని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షుడు మణిమాల వెంకట అప్పారావు, చిట్టినేని జోజీ బాబు, రైతు విభాగం అధ్యక్షుడు ముక్కామల రామచంద్రరావు , నీటి సంఘం అధ్యక్షుడు చిట్టినేని శివ రామ కృష్ణ, వడ్డు చెరువు అధ్యక్షుడు చిట్టి నేని పాండు రంగారావు , బ్రమ్మలింగాయ చెరువు ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షుడు నిమ్మగడ్డ యేసుబాబు , వడ్డు చెరువు సెక్రటరీ కొనాతం మోహన్, ముక్కామల యేసుబాబు, గంట నాగేశ్వరరావు , బోయపాటి నాగేశ్వరరావు ,ఆలూరి రామారావు,నువ్వుల సురేష్ , దాసరి నళిని, ఆవుల వీరస్వామి, నువ్వుల రవి, నువ్వుల హనుమ లు ,మాదాల వెంకన్న, జొన్నలగడ్డ రంగారావు, ,చిట్టినేని రాముడు, మందపాటి వీరబాబు, వేమారెడ్డి శివ, గొల్లిపల్లి సుబ్బారావు, ఆవుల రాంబాబు, ఆవుల వెంకటేశ్వరావు, చిట్టిపోతుల రాంబాబు , షేక్ భాష పాల్గొన్నారు..

# ఈ క్షణం దాటితే ఏదైనా జరగవచ్చు!





**విస్సన్నపేట,మార్చి 29 (వార్తాప్రభ) :** నూతనంగా ఏర్పడనున్న విస్సన్నపేట నియోజకవర్గం నకు టిడిపి అధిష్టానం ఆదేశిస్తే స్థానిక మండలానికి చెందిన ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు, ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావులకు అవకాశం ఉంటుందని వారి అభిమానులు అనుకుంటున్నారు. విసన్నపేట మండలంలో గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపుకు సాంకేతికతను జోడించి వినూత్న రీతిలో ఎన్ఆర్ఐల సహాయ సహకారాలతో టిడిపి గెలుపే లక్ష్యంఅన్న ఏకైక నినాదంతో ఉమ్మడి పోరుకు బాట వేసిన వల్లభనేని గిరిబాబు కు విస్సన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అవకాశం ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేసే ఆలోచనలో కొందరు ఉన్నారు. అదే సమయంలో సుదీర్ఘకాలంగా కులమత రాజకీయాలకతీతంగా 100 ఎకరాలకు పైగా భూమిని పణంగా పెట్టి నరసాపురం అభివృద్ధికి విద్య వైద్య రంగాలలో తన వంతు చేయూత ఇస్తూ గ్రామ అభ్యుదయానికి అన్నీ తానే అయి రోడ్లు రహదారులు డ్రైనేజీ వ్యవస్థ మసీదులు చర్చిలు అభివృద్ధికి తన వంతు అందిస్తూ గురుకుల పాఠశాల ఏర్పాటుకు 10 ఎకరాల స్థలాన్ని తమ పూర్వీకుల పేరున విరాళంగా ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ విద్య శాలలకు ఆట స్థలాలు ఏర్పాటు, మూడు కోట్ల రూపాయల నిధులు కొంత దాతల సహకారంతో దేశంలో మూడవ శ్రీ సూర్య లక్ష్మీ నారాయణ దేవాలయం దశావతారాలు అష్టలక్ష్ములు నవగ్రహాలు వీటితోపాటు విగ్నేశ్వరుడు ఆంజనేయుడు అయ్యప్ప దత్తాత్రేయుడు మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసి ఒక యాత్ర స్థలంగా ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం నరసాపురం గ్రామంను మార్చడం జరిగింది. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం తరపున గోటేటికీ విస్సన్నపేట నియోజకవర్గ శాసనసభ్యునిగా పోటీ చేసేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా మైలవరం నియోజకవర్గంలో దేవినేని ఉమకు ఖాళీలేనందున నందిగామ రిజర్వేషన్ కనుచూపుమేరలో మార్పు రానందున విసన్నపేట నియోజకవర్గ అభ్యర్థిగా అధిష్టానం అనౌన్స్ చేసే పరిస్థితి కూడా ఉంటుందని కొందరు మేధావులు అంటున్నారు.

# తాతయ్య మాగంటి సత్యనారాయణ రావు జ్ఞాపకార్థం మనువడు సత్యనారాయణ చౌదరి ( నాని) 50000 విరాళం



**విస్సన్నపేట,మార్చి 29 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో టిడిపి యువ నాయకుడు మాగంటి శోభన ప్రసాద్ కుమారుడు నాని( సత్యనారాయణ చౌదరి) తమ తాతయ్య మాగంటి సత్యనారాయణ రావు జ్ఞాపకార్థం నరసాపురం శ్రీ సూర్య లక్ష్మీనారాయణ దేవాలయం అభివృద్ధి కొరకు 50 వేల రూపాయల విరాళం ఆలయ ధర్మకర్త గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావుకు అందించారు. ఈ కార్యక్రమశీలో నాని మాట్లాడుతూ తమ కుటుంబం నిత్య దేవతారాధనలో ఉంటామని తాము సంపాదించిన సంపాదనలో కొంత భాగం దైవ కార్యాలకు వినియోగించవలసిందిగా తమ తండ్రి శోభన ప్రసాద్ ఆయన ఆచరించిన ఆచరణను మరియు ఆశయాలను తాను కొనసాగిస్తున్నానన్నారు. మానవసేవే మాధవ సేవగా మనం ముందడుగు వేస్తూ వెళుతుంటే నడిచే బాటలో కొత్త పరిచయాలు ఏర్పడతాయని వారికి అందించే సేవలే ఆశీస్సులుగా అందుతాయని చెప్పారన్నారు.నాని నానమ్మ సుభాషిని, బాబాయి శ్రీనివాస్ ఇతర కుటుంబ సభ్యులు సూర్య దేవాలయం సందర్శించడం ప్రతి దేవతా మూర్తులకు పూలదండలు పసుపు కుంకుమలు జాకెట్ ముక్కలు పూజా సామాగ్రి దేవత మూర్తులకు ఆలయ పూజారులకు ధర్మకర్తనేన తనకు సైతం వస్త్రాలు కానుకలు అందించడం మాగంటి వారి పెట్టిపోతలకు దర్పణం అని ధర్మకర్త సుబ్రహ్మణ్యేశ్వర రావు అన్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు శాలువాలతో పసుపు కుంకుమలతో ఆలయ మర్యాదలతో ఘనంగా పూజా కార్యక్రమం అనంతరం వేద ఆశీర్వాదాలు ఇప్పించడం జరిగింది.

# కాకినాడ జిల్లా కలెక్టరుగా హరేంద్ర ప్రసాద్



**కాకినాడ,మార్చి 29 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కలెక్టరుగా ఎంఎన్ హరేంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. ఈయన విశాఖ జిల్లా కలెక్టరుగా పనిచేస్తూ బదిలీపై కాకినాడకు వచ్చారు. కాకినాడలో జిల్లా కలెక్టరు గా పనిచేస్తున్న షాన్ మోహన్ సగిలిని అమరావతిలో ఆర్థిక మండలి సీఈఓగా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. కలెక్టరుగా రానున్న హరేంద్ర ప్రసాద్ కాకినాడలో వాణిజ్య పన్నుల శాఖలో గతంలో ఉప కమిషనరుగా బాధ్యతలు నిర్వహించారు.

# తోటచర్ల లో టి.డి.పి. 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు..




**పెనుగంచిప్రోలు,మార్చి 29 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని తోటచర్ల గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు, స్వర్గీయనందమూరితారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి, తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు,తోటచర్ల గ్రామ పెద్దలు మాట్లాడుతు స్వర్గీయ నందమూరి తారక రామారావు కృషిని, తెలుగుదేశం పార్టీ స్థాపించి వారు చేసిన సేవలను కొనియాడారు,. ఈ కార్యక్రమంలోసొసైటీ అధ్యక్షులు వేముల వెంకటేశ్వర రావు. కుంట ముక్కల ప్రకాష్,చిగు రపాటి ప్రసాద్,యామార్తి సై దులు,పులగం కృష్ణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు..

# ఉప్పు మడిలో లేఅవుట్ పింకీస్

## లేఅవుట్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా





**కాకినాడ,మార్చి 29 (వార్తాప్రభ) :** కాకినాడ గ్రామీణప్రాంత పరిధి మహాలక్ష్మి నగర్ ప్రాంతం సమీపంలో ఆకుల శ్రీరాములు కళాశాల సమీపంలో సర్వే నెంబర్ 218 స్థలం ఏ విధమైన అనుమతులు లేకపోయినా పింకీస్ లేఅవుట్ పేరుతో 2ఎకరాలను లేఅవుట్లుగా అమ్మకానికి సిద్ధం చేశారు.గతంలో ఈ ప్రాంతం అంతా ఉప్పుమడులుగా ఉన్న ఈ ప్రాంతాన్ని నేడు లేఅవుట్లుగా వేసి విక్రయాలకు సిద్ధం చేశారు.ఈ లేఅవుటు 130 గజాలుగా విభజన చేసి గజం రూ.9వేల నుంచి రూ.12 వేలు వరకు విక్రయిస్తున్నారని సమాచారం. సాధారణంగా ఉప్పు మడి ప్రాంతం నివాసయోగ్యానికి అనుమతులు ఉండవు. కానీ ఈ లేఅవుట్ వేసి విక్రయాలు సాగించడానికి కొందరు బడా బాబులు రంగంలో ఉన్నారని తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంపై జిల్లాస్థాయి అధికారులు దృష్టిసారించి అనుమతి లేని లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# శిల్పా రామంలో ఆకట్టుకున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు





**శేరిలింగంపల్లి,మార్చి 29 (వార్తాప్రభ)**:మాదాపూర్ లోని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.విదుర సంస్కృతి సంగీతలయం గురువు లక్ష్మిసౌజన్య శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో "పుష్పాంజలి,విఘ్నరాజం భజే,ముద్దుగారే యశోద,ఇదిగో భద్రరి, శరణం భవ,నగుమోము, బ్రహ్మాంజలి, శివ స్తుతి" అంశాలను సహస్ర, సంహిత, సిద్ధిత, సిశ్రీత,శ్రీనిక, వర్షిత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.తదుపరి షణ్ముఖి శిష్య బృందం "పుష్పాంజలి, వినాయక కౌతం,రామదాసు కీర్తన, తిల్లాన,గణేశ పంచరత్నం, కొలువైతివారంగా సాయి,అన్నయ్య కీర్తన, భామాకలాపం" అంశాలను భవాని, రక్షిత,మనవి, నిహిత, విధ్యుల్లత, విరజ,శాన్వి, భానుశ్రీ, షాలిని తదితరులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి నాట్య గురువు వనజ ఉదయ్, పాత్రికేయురాలు ప్రేమమాలిని వనం, ఫోక్ సింగర్ మధు ప్రియ హాజరై కళాకారులను అభినందించారు.

## ఆకట్టుకున్న అమ్మో ఆదివారం నాటిక




**హైదరాబాద్ :మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్, ధాత్రి సంక్షేమ సంఘం, ధాత్రి కళాంజలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య అద్వైతత్వ సంగీత నాటకోత్సవాలు బుధవారం జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్లో వేడుకగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన అమ్మో ఆదివారం సాంఘిక నాటిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శాంతి కుమారి, సుధా, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నేటి కాలపు రీతి!!




కాయకష్టం చేసే ఎద్దు వీపున
కలత పెట్టే గాయం ఒక నరకం
కానీ పొంచి చూసే కాకి కంటికి
అదే ఒక తీపి విందు, ఒక పండగ!!
ఒకరి కంటి నుండి రాలిన కన్నీరు
మరొకరి దాహాన్ని తీర్చే పన్నీరు
ఒకరి గూడు చిందరవందర అయితే
ఇంకొకరికి అది కట్టెల మోపు లాభం!!
ప్రాణం పోయే వేళలో ఒకడి ఆర్తనాదం
పక్కవాడికి అది కేవలం ఒక వార్త
గుండె పగిలి ఒకడు విలవిలలాడుతుంటే
అదే అవకాశంగా మరికొందరు అడుగులు!!
సహాయం చేయని చల్లని చూపుల కంటే
గాయాన్ని పొడిచే కాకి ముక్కే నయం
ఎందుకంటే అది పక్షి కాబట్టి...
కానీ మనిషై ఉండి మృగంలా మారడమే ఘోరం!!
పరుల కష్టాన్ని చూసి నవ్వుకోకు
నీ లాభం కోసం ఎదుటివాడిని వాడుకోకు
ఎద్దు పుండు కాకికి ముద్దు కావచ్చు కానీ
మానవత్వం మంటగలిస్తే మనకిక మిగిలేదేముంది!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని

# చదువుల తల్లికి సలాం!!

● మహిళా విద్యే అభివృద్ధికి అసలైన ప్రతీక ● సొంత ఖర్చులతో సాయంత్రం పాఠశాలలు ● సోదరీమణుల సహకారంతో ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం ● 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం కార్పొరేషన్ 41వ డివిజన్ కార్పొరేటర్, సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా వినూత్న పిలుపునిచ్చారు. ఆదివారం ఉల్లాస్ పథకంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరాస్యత పరీక్షా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, మహిళా విద్యే అభివృద్ధికి అసలైన ప్రతీక అని, ఎక్కడైతే మహిళలు అక్షరాస్యులుగా ఉంటారో ఆ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. డివిజన్ అభివృద్ధి అంటే కేవలం మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా, ప్రతి ఒక్కరిని విద్యావంతులుగా మార్చడం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కూడా అందులో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని నిరక్షరాస్య మహిళల జాబితాను సిద్ధం చేయాలని ఆర్పీలకు సూచిస్తూ, త్వరలోనే వారందరి కోసం సాయంత్రం పాఠశాలలను ఏర్పాటు చేసి, తన సొంత ఖర్చులతో రెండు నెలల పాటు ప్రత్యేక విద్యా బోధన అందిస్తానని సూర్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా సి.ఓ శమంతక మణి, ఆర్పీలు స్వర్ణలత, సరోజ, సుశీల, మహిళా సంఘాల సభ్యులు దేవలక్ష్మి, రాధా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యం!!

● కార్పొరేట్ కొలువులకు శిక్షణ ● శిక్షణతో మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ● నైపుణ్యంతోనే నవ భవిష్యత్తు ● కమ్యూనికేషన్ స్కిల్స్, బిజినెస్ ప్రజెంటేషన్‌పై ఉచిత శిక్షణ ● స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.సుబ్బారావు




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖని శారద నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో 'టిసిఎస్ అయాన్ జాబ్ అచీవర్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్' ప్రోగ్రాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ రిసోర్స్ పర్సన్ కుమార్, కౌన్సిలర్లు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిరుద్యోగ సమస్యను తగ్గించి, విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా విశ్వవిద్యాలయం ఈ వినూత్న కార్యక్రమాన్ని రూపకల్పన చేసింది అని తెలిపారు నిర్వాహకులు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల వృత్తి నైపుణ్యాలు, మల్టీనేషనల్ కంపెనీలలో లభించే ఉద్యోగ అవకాశాల పట్ల విస్తృత అవగాహన కల్పించి, వారి పేర్లను నమోదు చేయించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు వారి అర్హతలను బట్టి అడ్మిషన్ ఇచ్చి, అనంతరం ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్, బిజినెస్ ప్రజెంటేషన్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సరైన శిక్షణ ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని డాక్టర్ సుబ్బారావు ఆకాంక్షించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ కుమార్ విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించి, నమోదులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించారు.

# మెగా లోక్ అదాలత్‌లో 8,120 కేసుల పరిష్కారం!!

● బాధితుల చెంతకు రూ.61 లక్షల సైబర్ మనీ ● న్యాయం త్వరితగతిన... ఖర్చులు అతి తక్కువన ● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా మొత్తం 8,120 పెండింగ్ కేసులు విజయవంతంగా పరిష్కరించబడ్డాయి. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 674 ఐపీసీ కేసులు, 17 ఎస్.ఎల్.ఎల్ కేసులు, 2,537 ఇ-పెట్టి కేసులు, 4,892 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కొలిక్కి వచ్చాయి. ముఖ్యంగా సైబర్ నేరాలకు గురైన 84 మంది బాధితులకు రూ.61,00,626 మొత్తాన్ని తిరిగి అందజేయడం విశేషం. రాజీ మార్గమే ఉత్తమమని గత 15 రోజులుగా కోర్టు సిబ్బంది, పోలీసులు సమన్వయంతో కక్షిదారులకు అవగాహన కల్పించడంతో ఈ భారీ స్థాయిలో ఫలితాలు సాధించబడ్డాయి. ఈ లోక్ అదాలత్ వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు సత్వర న్యాయం చేకూరిందని సీపీ తెలిపారు. శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూనే కేసుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందిస్తూ త్వరలో రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, న్యాయమూర్తుల సహకారానికి ఈ సందర్భంగా పోలీస్ శాఖ తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సుభాష్ నగర్ రోడ్లపై ప్లాస్టిక్ 'విషం'.. పశువుల ప్రాణాలకు ముప్పు!

● లాస్ట్ బస్ స్టాప్ వద్ద చెత్తాచెదారంలో ప్లాస్టిక్ కవర్లు తింటున్న పశువులు ● రోడ్లపై చెత్త వేయడం నేరం, ప్రమాదకరం - పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్. ● అవగాహన లేని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు డిమాండ్.




**కుత్బుల్లాపూర్, మార్చి 29, (వార్తాప్రభ)** : జిహెచ్ఎంసి కొంపల్లి సర్కిల్, సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని లాస్ట్ బస్ స్టాప్ వద్ద సామాన్యులు, వాహనదారులు విసిరేసిన ప్లాస్టిక్ కవర్లు పశువుల ప్రాణాలకు ముప్పుగా మారాయి. రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేస్తున్న చెత్తాచెదారం మధ్య ఆహారం కోసం వెతుక్కుంటున్న ఆవుల మంద అలాగే పశువుల మంద, విషపూరితమైన ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న దృశ్యాలు పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ని తీవ్రంగా కలచివేసాయి.

**ప్లాస్టిక్ తింటే మృత్యువే!** ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. "పశువులకు ప్లాస్టిక్ కవర్లు జీర్ణం కావు. అవి కడుపులో పేరుకుపోయి, పేగులను అడ్డుకుని, ఆకలితో అలమటించి చనిపోయే ప్రమాదం ఉంది. గోమాతలను పూజిస్తామని చెప్పుకునే మనం, ఇలాంటి పరిస్థితులకు కారణమవుతున్న అవగాహన లేని వారిపై చర్యలు తీసుకోకపోవడం విచారకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**రోడ్లపై చెత్త వేయడం చట్టరీత్యా నేరం!** రోడ్లపై, చెత్త కుప్పల్లో ప్లాస్టిక్ కవర్లు వేయడం చట్టరీత్యా నేరమని, ఇది పర్యావరణానికి, పశువుల ప్రాణాలకు ఎంతో ప్రమాదకరమని రవీందర్ ముదిరాజ్ స్పష్టం చేశారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తూ దొరికితే మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించాలని డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, దుకాణదారులు కూడా సహకరించాలని కోరారు.

# తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

**దుబ్బాక, మార్చి 29 , (వార్తాప్రభ)** తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సీఐ రాజేష్ అన్నారు. నిత్యం మద్యం తాగి వచ్చి, తల్లిదండ్రులను తిడుతూ, చంపుతామని బెదిరిస్తున్న కుమారులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన ఘటన దుబ్బాక పట్టణంలో ఆదివారం జరిగింది. దుబ్బాక సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కంచం కనకయ్య, రాజవ్వ దంపతులకు ముగ్గురు కుమారులు నరేష్, స్వామి, ఎల్లం, ఒక కుమార్తె కవిత ఉన్నారు.వీరికి ఒక ఇల్లు తో పాటు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.రెండవ కుమారుడు స్వామి, మూడవ కుమారుడు ఎల్లం ప్రతిరోజూ మద్యం సేవించి, తల్లిదండ్రులను ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ, ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని, లేదంటే చంపుతామని బెదిరిస్తున్నట్టు తల్లిదండ్రులు వాపోయారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## కార్మిక లోకమా.. కలెక్టరేట్ ముట్టడికి కదలిరండి!!

● సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికులు తరలిరావాలి ● నష్టదాయకమైన లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే ● పెద్దపల్లి జిల్లా కార్మిక సంఘాల సమర శంఖం ● హక్కుల సాధనకై ఏప్రిల్ 1న కలెక్టరేట్ ముందు గర్జన



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 29 (వార్తాప్రభ ప్రతినిధి)** కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఏప్రిల్ 1న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కార్మిక సంఘాల జాయింట్ సమావేశం పిలుపునిచ్చింది. ఆదివారం గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నాయకులు ఈ. నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ నేత భూమల చందర్, ఏఐటీయూసీ కడారి సునీల్, సీఐటీయూ ఏ. ముత్యం రావు, టీయూసీఐ తోకల రమేష్, ఐఎఫ్‌టీయూ బి. అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ల వల్ల కార్మిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని, వీటిని రద్దు చేసి కార్మిక చట్టాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఈ కోడ్లను తెలంగాణలో అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేయాలని వారు కోరారు. ఏప్రిల్ 1న జిల్లాలోని ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి సహా అన్ని పరిశ్రమలు, మండల కేంద్రాల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్, సిపెల్లి రవీందర్, ఈసంపల్లి రాజేందర్, ఈదునూరి రామకృష్ణ తదితర కార్మిక నేతలు పాల్గొన్నారు.

## జైరాం నగర్‌లో ఆధ్యాత్మిక చైతన్యం

● కట్ట మైసమ్మ, పోచమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి అంకురార్పణ! ● సొంత నిధులు, జేసీబీ సహాయంతో ఆలయ ప్రాంగణం శుభ్రం చేసిన కుంట సిద్ధిరాములు. ● నాలుగు పిల్లర్ల నిర్మాణానికి ఆర్థిక సాయం - ఆలయ అభివృద్ధికి వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు. ● భక్తిశ్రద్ధలతో పనుల్లో నిమగ్నమైన స్థానిక నేతలు, మహిళా భక్తులు.




**కుత్బుల్లాపూర్/జైరాం నగర్, మార్చి 29, (వార్తాప్రభ) :**కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని జైరాం నగర్‌లో వెలసిన కట్ట మైసమ్మ మరియు కట్ట పోచమ్మ దేవాలయాల పునర్నిర్మాణ పనులు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు మరియు వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుల విన్నపం మేరకు, ప్రముఖ నాయకులు కుంట సిద్ధిరాములు తన సొంత ఖర్చులతో ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

**సొంత నిధులతో సేవా యజ్ఞం** ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కుంట సిద్ధిరాములు తన సొంత జేసీబీ యంత్రాన్ని పంపి ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. అంతేకాకుండా, ఆలయ నిర్మాణానికి పునాదిగా నిలిచే నాలుగు పిల్లర్లను తన సొంత నిధులతో నిర్మించి ఇస్తానని ప్రకటించి భక్తులలో హర్షం నింపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం నిరంతరం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

**కలసికట్టుగా కాలనీ వాసులు** వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కుంటి మల్లేష్, వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు, కాలనీ పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందరూ కలిసికట్టుగా శ్రమదానం చేస్తూ ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సేవా కార్యక్రమంలో కృష్ణవేణి, సరోజనమ్మ, బాలమణి, బి. రేఖ, రేవతి, బి. వెంకటేష్, ఉపేందర్, నరేందర్, నర్సింగ్, ఆంజనేయులు, యాదగిరి, శంకర్, కృష్ణ, సంజయ్ కుమార్, సందీప్, బచ్చ జ్ఞానేశ్వర్, సృజన్ మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## నాయకులు కావలెను.. ఒక్కసారిగా పెరిగిన డిమాండ్!

అసెంబ్లీ , పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రం వేగంగా మారిపోతోంది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గాల పునర్విభజన పుణ్యమాని మునుపెన్నడూ లేని విధంగా నాయకులకు గిరాకీ పెరిగిందని అంటున్నారు. ఏపీలో దాదాపు 88 అసెంబ్లీ, 13 పార్లమెంట్ నియోజకవర్గాలు కొత్తగా అందుబాటులోకి వస్తున్నాయి. అదేవిధంగా తెలంగాణలో సైతం 50 శాతం సీట్లు పెరుగుతున్నాయి. దీంతో ఆయా స్థానాల్లో జెండా ఎగురవేసే సమర్థులైన నేతల కోసం ప్రధాన పార్టీలన్నీ వేట మొదలుపెట్టాయి. కొత్త నియోజకవర్గాలు ఏర్పడటం ఒక ఎత్తైతే, అక్కడ ప్రజలను మెప్పించగల అభ్యర్థులను రంగంలోకి దించడం మరో ఎత్తుగా చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేవలం ప్రజాబలం ఉంటే సరిపోదని, పార్టీని నడిపించగల సమర్థతతోపాటు కొన్ని కీలక సమీకరణాలను పార్టీలు పరిగణనలోకి తీసుకుంటున్నాయని అంటున్నారు. ప్రజలను తమవైపు తిప్పుకోగల నేర్పు, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేయగల రాజకీయ చతురత ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందంటున్నారు. దీంతో ప్రధాన పార్టీలు తమ ప్రత్యర్థులను సైతం ఆకర్షించేలా ఆపరేషన్ స్టార్ట్ చేస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ఎన్నికల నిర్వహణ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో, ఆర్థికంగా బలంగా ఉన్నవారిని గేలం వేసేలా పార్టీలు అడుగులు వేస్తున్నాయని చెబుతున్నారు. కొత్త నియోజకవర్గాలకు బాధ్యతలు అప్పగించడానికి సొంతంగా ఖర్చు పెట్టుకోగల నాయకుల కోసం పార్టీలు 'రెడ్ కార్పెట్' పరుస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. అదేసమయంలో కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో ఏ సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి? ఎవరిని నిలబెడితే గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉంటాయనే లెక్కల్లో పార్టీలు అగ్రనాయకత్వాలు దృష్టి పెడుతున్నాయని చెబుతున్నారు. కాగా, నియోజకవర్గాల పెరుగుదల ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలకు పెద్ద పరీక్షగా మారిందని అంటున్నారు. ఇప్పటికే ఉన్న స్థానాల్లోనే సరైన అభ్యర్థులు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో, అదనంగా పెరిగిన స్థానాలను భర్తీ చేయడం విపక్ష పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని అంటున్నారు. బలమైన అభ్యర్థులు లేకపోతే అధికార పార్టీ దూకుడును అడ్డుకోవడం అసాధ్యమని విపక్ష నేతలు ఆందోళన చెందుతున్నారు. ఇక అధికార పార్టీకి వనరులు, ఆశావహులు ఉన్నప్పటికీ, కొత్త నేతలను గ్రౌండ్ లెవల్ నుంచి తయారు చేయడం అంత సులువేమీ కాదని విశ్లేషిస్తున్నారు. పాత నేతల మధ్య సమన్వయం కుదర్చడం, కొత్తవారికి టికెట్లు ఇస్తే వచ్చే అసమ్మతిని తట్టుకోవడం వంటి అంతర్గత సమస్యలు అధికార పార్టీకి సవాల్ విసురుతున్నట్లు చెబుతున్నారు. కేవలం గెలుపు గుర్రాలనే నమ్ముకోవాలా లేక పార్టీ కేడర్ నుంచి నాయకులను ప్రోత్సహించాలా అన్న సందిగ్ధాన్ని అధికార పార్టీ ముఖ్యులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి, పునర్విభజన అనేది రాజకీయ నిరుద్యోగులకు వరంలా మారిందని వ్యాఖ్యానిస్తున్నారు.

## కొత్తపేటలో ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు

**బండలాగురు పోటీలను ప్రారంభించిన మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**



**షాద్ నగర్ మార్చి 29 (వార్తా ప్రభ ప్రతినిధి):** షాద్నగర్ నియోజకవర్గం కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ హనుమాన్ రామలింగేశ్వర స్వామి వారి గుడి సన్నిధిలో అత్యంత వైభవంగా శ్రీ రామ నవమి ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ఆంధ్ర విశాల శ్రావణ్ రెడ్డి హాజరై మండల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు శ్రీరామనవమి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్లూరి హైమావతి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా హనుమాన్ శోభాయాత్ర...



**ఆసిఫాబాద్, మార్చి 29 (వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లాకేంద్రంలోని ఉత్తర వాహిని నదితీరంలో వెలసిన కేస్లాపూర్ శ్రీ వీరంజనేయ స్వామి శోభాయాత్ర పుర వీధుల్లో కన్నుల పండువగా కొనసాగింది హనుమాన్ ఉత్సవ విగ్రహానికి ఆలయ ప్రధాన అర్చకులు వొజ్జల శిరీష్ శర్మ వారణసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర ను అలయకమిటి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి గుండ వెంకన్న కోశాధికారి పిన్న వివేక్ ఏకీరాల శ్రీనివాస్ ప్రచార కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణ చారి డాక్టర్ మధు తుజులపురం మురళీధర్ గౌడ్ ల నేతృత్వంలో కేస్లాపూర్ మందిరం నుండి ప్రారంభమైన శోభాయాత్ర జైశ్రీరాం జై హనుమాన్ శరఘోషణతో నృత్యలు చేస్తు షిరిడి సాయిబాబ మందిరం,పొట్టి శ్రీరాములు చౌక్, గాంధీచౌక్, వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ గుండ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మెన్ ఇరుకుల్ల మంగ, మున్సిపల్ చైర్మన్ ఆకాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, బురుగుడా సర్పంచ్ మెకార్తి సంగీత లక్ష్మణ్, న్యాయవాదులు రాపర్తి రవిందర్, సతీష్ బాబు,కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, రాపర్తి కార్తిక్, కుర్సెంగ బాలకృష్ణ, మాజీ ఎంపిపి బాలేశ్వర్ గౌడ్, బిసి నాయకుడు డాక్టర్ రమేష్, భక్తులు పాల్గొన్నారు. ఈ శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహనకు ఎస్ హెచ్ ఓ.బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై లు కోమరయ్య కమలాకర్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం దిగి వచ్చేవరకు ఆందోళన కొనసాగుతుంది

***5 వ రోజు కొనసాగిన జిజిహెచ్ సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహారదీక్ష***

***దీక్షలు ప్రారంభించిన సిఐటీయు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు***




**కాకినాడ, మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి మరియు రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద బుదవారం ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 5వ రోజైన ఆదివారం కూడా నిర్వహించారు.సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిజిహెచ్ లో సెక్యూరిటీ గార్డ్స్ కి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేసారు. కాంట్రాక్టర్ దిగి వచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు.శనివారం సాయంత్రం జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి పి సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జి కలిసి సెక్యూరిటీ గార్డ్స్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు సంస్థ యాజమాన్యం వచ్చి సమస్య పరిష్కరించాలని ఆదేశించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అదేవిధంగా ఆర్ఎంసి ప్రిన్సిపాల్ డా. ఎ. విష్ణు వర్ధన్ కు పలివెల వీరబాబు, మేడి శెట్టి వెంకటరమణ లు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాలతో యాజమాన్యం దిగి వస్తుందని ఆశిస్తున్నామన్నారు. యాజమాన్యం దిగి వచ్చేవరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన సాగుతుందన్నారు. 5 వ రోజు దీక్షల్లో మలక వెంకటరమణ తో పాటు సెక్యూరిటీ గార్డ్స్ లంకే ధర్మ, కె. భాగ్యలక్ష్మి, శేరి దుర్గ, పోతుల దేవి, శేరి శివగంగ లు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ లతో పాటు చెక్కా ధర్మారావు, అప్పన్న, బాలరాజు, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, సోమరాజు, ఆదినారాయణ, భాస్కరరావు, షఫీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

**పెదన మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డాక్టర్ ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం జాస్తి సుబ్బారావు అండ్ పోలవరపు సత్యనారాయణ మెమోరియల్ నేత్ర వైద్య కేంద్రం గుడ్లవల్లేరు అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం మండల ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి వాసవి క్లబ్ కెసిజిఎఫ్ పొట్టి శ్రీరాములు పెడన వారి సహకారంతో స్థానిక శ్రీ వాసవి ప్రార్ధన మందిరము నందు ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స మెగా వైద్య శిబిరాన్ని ఆప్స్ వ్యవస్థాపకులు డా. కొల్లూరి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం నందు కంటి వ్యాధితో బాధపడుతున్న 100 మందికి డాక్టర్ ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య కేంద్ర వైద్య సిబ్బంది భవాని ధనలక్ష్మి మహేష్ శశిరేఖ మంజు భార్గవి నరేంద్ర పాల్గొనివివిధ రకముల నేత్ర పరీక్షల నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.మరో 50 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డా. కొల్లూరి పర్యవేక్షణలో విజయవంతమైన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆత్మకూరి సురేష్ కుమార్ ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా కార్యదర్శి సమయ మంత్రి కుమార్ కార్యవర్గ సభ్యులు కొల్లిపర పవన్ సభ్యులు పెనుగొండ



మామిళ్ల కొల్లూరి భాస్కర్ శ్రీ వాసవి మహిళా మండలి ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నూరు అపర్ణ సభ్యురాలు కొల్లూరి ఉష వాసవి క్లబ్ కేసిజిఎఫ్ పొట్టి శ్రీరాములు పెడన పిఆర్ఓ కొల్లూరి పద్మ ఐ వి ఎఫ్ కృష్ణజిల్లా పిఆర్ఓ ఉదయగిరి గోపాల్ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం ఉపాధ్యక్షులు చిలకల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు కనీస వేతనాలు ఇవ్వాలి : యార్లగడ్డ






**గన్నవరం, మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమాజానికి మూల స్తంభాలుగా ఉన్న జర్నలిస్టులకు కనీస వేతనాలు అందించేలా నూతనంగా ఎన్నికైన ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) కార్యవర్గం కృషి చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ 11వ ప్లీనరీ కార్యక్రమానికి చివరి రోజైన ఆదివారం సాయంత్రం యార్లగడ్డ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జర్నలిస్టు నాయకుల్ని ఉద్దేశించి యార్లగడ్డ ప్రసంగిస్తూ జర్నలిస్టులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. కనీస వేతన చట్టం అమలు అయ్యేలా ఐజేయు నూతన కార్యవర్గం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలని సూచించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వార్తలు సేకరించి, ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంతోపాటు, సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం చేయూతనివ్వాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సుమారు 24 సంవత్సరాల తర్వాత ఐజేయు సమావేశాలకు విజయవాడ వేదిక కావటం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సమావేశాలను దిగ్విజయంగా నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే నాయకత్వాన్ని అభినందించారు. ఐజేయు అధ్యక్షులుగా ఎన్నికైన బలివిందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ గా ఎన్నికైన డి.సోమసుందర్ ఇతర కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఆయన జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐజేయు చేస్తున్న కృషిని ప్రశంసించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజేయు అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు చావా రవి, దేవులపల్లి అమర్, ఏచూరి శివ, దాసరి నాగరాజు, అజయ్, అట్లూరి రాజశేఖర్, కోదూరు రామకృష్ణ, చలమలశెట్టి శ్రీనివాస్, నల్లగంచు శ్రీ రామకృష్ణ, దాసరి చెంచు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలే మా దిశ - అమరావతి అజేయం, శాశ్వతం

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య**

**తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలకు ఘన సన్మానం**





**నందిగామ మార్చి 29 (వార్తా ప్రభ):** స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని బాబు జగజీవన్ రామ్ బిల్డింగ్‌లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం తెలుగు తమ్ముళ్లు ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలతో కలిసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ, తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన పార్టీగా నిలిచిందన్నారు. నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ సామాన్యులను చట్టసభలకు పంపించి ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చిందని పేర్కొన్నారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టి అతడు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ పనిచేశారని, అదే స్ఫూర్తితో పార్టీ ఇప్పటికీ ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచిన తెలుగుదేశం పార్టీ మహిళలకు స్థానిక సంస్థల్లో ముందుగానే రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి పునాది వేసిందని తెలిపారు. అమరావతి రాజధాని విషయంపై మాట్లాడుతూ, మూడు రాజధానుల భావనకు ఇక ముగింపు పలుకుతూ ఒకే రాష్ట్రం -- ఒకే రాజధాని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. అమరావతి దేశంలోనే అగ్రగామి నగరంగా అవతరించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. అమరావతి వ్యతిరేక శక్తులను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. పార్టీ విజయాలతో పాటు సంక్షోభాలు, సవాళ్లను కూడా ఎదుర్కొన్నదని, ఎన్నో త్యాగాలు చేసిన కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని అన్నారు. హత్యలు, అరెస్టులు, అణచివేతలు వంటి ఇబ్బందులు వచ్చినప్పటికీ తెలుగుదేశం పార్టీని ఎవ్వరూ దెబ్బతీయలేరని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సమర్థంగా పనిచేసే కార్యకర్తలకే గుర్తింపు లభిస్తుందని, కార్యకర్తల శిక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీగా తెలుగుదేశం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. చివరగా, ఒకప్పుడు రైతు బిడ్డగా ఎదిగిన ఎన్టీఆర్ నేడు చరిత్రగా నిలిచారని, ఆయన ఆశయాలను సాకారం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులను సౌమ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు,లాల్ బహుదూర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు, కౌన్సిలర్లు, గ్రామ వార్డు తెదెపా నేతలు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.



**మచిలీపట్నం మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం ఆర్. కె.మెస్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం కృష్ణాజిల్లా భదిర సంయుక్త సంఘం ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ స్త్రీల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భధిర ఫౌండేషన్ ప్రత్యేక శిక్షణ మాజీ సభ్యురాలు టి. ఆర్. వి. సత్యవాణి (విజయవాడ) ముఖ్యఅతిథిగా హాజరై భధీరలకు సాంకేతిక రూపంలో(సైన్ లాంగ్వేజి) తన ప్రసంగాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం అసెంబ్లీ ఇంచార్జి జనసేన పార్టీ బండి. రామకృష్ణ, కృష్ణాజిల్లా దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు వి. కామరాజు, రాష్ట్ర భధిర సంయుక్త సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ డి. రాజ్యలక్ష్మి పాల్గొని స్త్రీలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షులు ఎన్ శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీ బి నాగబాబు పర్యవేక్షించారు.

## దేవినేని ఉమా పుట్టిన సందర్భంగా అన్నదానం





**ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మార్చి 29(వార్తాప్రభ ప్రతినిది ):** టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి వర్యులు శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు 64 వ పుట్టినరోజు సందర్భంగా తెలుగు యువత ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి, తెలుగు యువత రెడ్డిగూడెం మండల మాజీ అధ్యక్షుడు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దబాబు) ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ వృద్ధుల డే కేర్ సెంటర్ నందు నిరుపేదలైన వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసి వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన జవహర్ నవోదయ ప్రిన్సిపాల్



**హనుమాన్ జంక్షన్, మార్చి 29(వార్తాప్రభ)**బాపులపాడు మండలం వేలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న దాశరథి యదునందనరావు ( 59 ) ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారుహనుమాన్ జంక్షన్ మీదుగా వేలేరు నవోదయకు తన కారును స్వయంగా నడుపుకుంటూ వెళుండగా నవోదయ సమీపంలో రోడ్డుపక్క ఆగి ఉన్న టిప్పర్ లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై హనుమాన్ జంక్షన్ ఎస్ఐ వెలుగుల సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

## కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత... ఎంఎల్ఏ కృష్ణ ప్రసాద్...



**కృత్తివెన్ను మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పెడన నియోజవర్గ శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆదివారం నాడు టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీకి సేవలందించిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో వారి చేస్తున్న అక్రమాలను ఖండిస్తూ అక్రమ కేసులు సైతం లెక్కచేయకుండా వైసీపీ ప్రభుత్వం 9 కేసులు బనాయించిన కూడా తెలుగుదేశం పార్టీ మరియు శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ గెలుపు కోసం నిలిచిన డీసీ చైర్మన్ బొర్రా కాశీ ని, ఎంఎల్ఏ కాగిత కృష్ణ ప్రసాద్ దుశ్యాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమేష్ చంద్ర యావత్ సమాజానికి దిక్సూచి: మంత్రి నాదెండ్ల మనోహర్

**ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఉమేష్ చంద్ర: ఆలపాటి**

**ఉమేష్ చంద్ర క్రమశిక్షణ, నిష్పక్షపాత ధోరణికి ప్రతిరూపం: ఆకే రవి కృష్ణ**







**తెనాలి,** మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి) చదలవాడ ఉమేష్ చంద్ర ఒక వ్యక్తి మాత్రమే కాదని, సమాజానికి స్ఫూర్తి ప్రతీక అని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆయన 60వ జయంతి సందర్భంగా తెనాలిలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ బొమ్మ సెంటర్‌లో ఉన్న ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల కోసం అంకితమైన ఉమేష్ చంద్ర జీవితం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. తొలుత ఉదయం నుంచే ఉమేష్ చంద్ర విగ్రహానికి పలువురు పోలీసు అధికారులు, నగర ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హోటల్ గౌతమ్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో పలువురు ప్రముఖులు ప్రసంగించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, "ధైర్యం, నిబద్ధత, కర్తవ్యబద్ధతకు ఉమేష్ చంద్ర నిదర్శనం. ఆయన చూపిన మార్గంలో నడవడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, "చదలవాడ అంటే నమ్మకం, నాయకత్వానికి ప్రతీక. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు ఉమేష్ చంద్ర" అని అన్నారు. ఆయన సేవా స్ఫూర్తి ఎల్లప్పుడూ మార్గదర్శకమని తెలిపారు. ఐజీపీ ఏకే రవి కృష్ణ మాట్లాడుతూ, "ఉమేష్ చంద్ర క్రమశిక్షణ, నిష్పక్షపాత ధోరణికి ప్రతిరూపం. నేరాలపై రాజీ పడని ధైర్యం పోలీస్ శాఖకు గర్వకారణం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ఉమేష్ చంద్ర సేవలు, త్యాగం ప్రతి అధికారికి ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేయాలనే స్ఫూర్తిని ఆయన జీవితం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజల పట్ల ప్రదర్శించిన అంకితభావం, విధి నిర్వహణలో చూపిన నిబద్ధత ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని భావోద్వేగంతో స్మరించుకున్నారు. సమాజం ఆయనను ఇంకా స్మరించుకోవడం తమకు గర్వకారణమని తెలిపారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ఉమేష్ చంద్ర ధైర్యసాహసాలు, న్యాయం కోసం పోరాడిన తత్వం ప్రతి ప్రజాప్రతినిధికి ఆదర్శమని అన్నారు. సమాజంలో న్యాయం, క్రమశిక్షణ స్థాపనలో ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, ఉమేష్ చంద్ర సేవా స్ఫూర్తి మహిళలకు, యువతకు ప్రత్యేకంగా స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజానికి అంకితమైన ఆయన జీవితం ఎప్పటికీ మార్గదర్శకంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఉమేష్ చంద్ర జీవితం, సేవలను ప్రతిబింబించే వ్యాసాల సంకలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఆయన జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించగా, యువత, విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండేలా ఉమేష్ చంద్ర ట్రస్ట్ రూపొందించిన మొబైల్ యాప్‌ను విడుదల చేశారు. జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. 1999లో హైదరాబాద్‌లో విధుల్లో ఉండగా నక్సలైట్ల చేతిలో వీరమరణం పొందిన ఉమేష్ చంద్ర త్యాగం ఎప్పటికీ చిరస్మరణీయమని వక్తలు గుర్తు చేశారు. ఆయన చూపిన ధైర్యం, నిజాయితీ, కర్తవ్యబద్ధత నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్వీఆర్ విద్యాసంస్థల (తెనాలి) అధినేత నన్నపనేని సుధాకర్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అభిమానులు పాల్గొన్నారు. ఉమేష్ చంద్ర తల్లిదండ్రులు చదలవాడ వేణుగోపాలరావు, నయనతార ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మెరుగైన సేవలు అందించిన పోలీస్ సిబ్బందిని సన్మానించారు. తెలంగాణ ఆర్టీసీ సిబ్బంది ఉమేష్ చంద్ర పై ఆలపించిన గీతాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి నేతలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

## నేడే దేవాలయాల హుండీ లెక్కింపు.


**మచిలీపట్నం** మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)కృష్ణా జిల్లా మచిలీపట్నం టౌన్, రూరల్ మండలములలో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానము బందరు కోట ,శ్రీ ఏకాంబరేశ్వర స్వామి వారి దేవస్థానం బందరు కోట,శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం, సర్కిల్ పేట, శ్రీ జగన్నాధ స్వామివారిదేవస్థానం, జగన్నాధపురం, దేవాలయాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల సమయములలో దేవదాయ ధర్మదాయ శాఖ కు చెందిన అధికారుల పర్యవేక్షణలో సదరు ఏరియాలకు చెందిన పోలీస్, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు, ధర్మకర్తల మండలి వారి సమక్షములో 30వ తేదీ సోమవారం ఈ దేవస్థానములలో హుండీలు తెరచి లెక్కించబడును. సదరు హుండీ కౌంటింగ్ లకు ఆసక్తి ఉన్న భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొనవలసినదిగా దేవస్థానముల కార్యనిర్వహణాధికారి కొండవీటి మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

## పెద్దిపాలెంలో ఘనంగా టిడిపి వ్యవస్థాపక దినోత్సవం



**ప్రత్తిపాడు** మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో ఆదివారం టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకుడు పి4 మార్గదర్శి రెడ్డి అమర్ నాథ్ చౌదరి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు కుండల అప్పారావు,లొండా వెంకటేష్,వనపర్తి నాగేశ్వరరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి నేత అమర్ నాథ్ చౌదరి మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా బడుగు బలహీన వర్గాలు పేదల అభ్యున్నతి అభివృద్ధి కోసమే అన్న నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించారని తెలిపారు.

## శాంతి కావాలంటే..
# మేం చెప్పినట్లు వినాలి
### గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక



అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు. గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా.. శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలన్నారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారన్నారు. తమ గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జోర్డాన్, ఇతర పశ్చిమాసియా దేశాలకు సూచించారు. తాము ఏ దేశంపైనా ముందస్తు దాడులు చేయబోమని అనేక సార్లు స్పష్టం చేసినట్లు పెజెష్కియాన్ పేర్కొన్నారు. కానీ తమ మౌలిక సదుపాయాలు, అణు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే మాత్రం చూస్తూ ఊరుకోబోమని.. ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొన సాగిస్తామన్నారు. శత్రువులకు సహకరించిన వారిని కూడా వదలబోమన్నారు.

**హర్మూజ్‌ను దాటిన మరో రెండు భారత నౌకలు**

భారత్ సహా తమ మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఎల్పీజీని మోసుకొస్తున్న మరో రెండు భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 90,000 టన్నులకు పైగా ఎల్పీజీ (వంటగ్యాస్)ని తీసుకువస్తున్న బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్ అనే రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయన్నాయి. మరో ఐదు భారతీయ ట్యాంకర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి ఉన్నట్లు తెలుస్తోంది.

# పసుపు జెండా గర్వకారణం- కార్యకర్తలే తెలుగుదేశం బలం

**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామలో ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**- పలు వార్డుల్లో జెండా ఆవిష్కరణ**



**నందిగామ మార్చి 29 (వార్తప్రభ):** పట్టణంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పట్టణంలోని (13, 11, 10, 8) వార్డులతో పాటు కాకాని నగర్, సీఎం రోడ్ మరియు రైతుపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ చారిత్రక ప్రస్థానంలో కార్యకర్తల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రతి కార్యకర్త కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలిచి పసుపు జెండాను గుండెల్లో దాచుకున్నారని కొనియాడారు. "కార్యకర్తలే మా బలం, వారి త్యాగమే పార్టీకి పునాది" అని ఆమె స్పష్టం చేశారు. ఇది కేవలం రాజకీయ సంబంధం మాత్రమే కాదని, కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుండే ఒక కుటుంబ బంధమని పేర్కొన్నారు. వారి శ్రమ, అంకితభావం వల్లే తెలుగుదేశం పార్టీ విజయపథంలో ముందుకు సాగుతోందని అన్నారు. 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి తెలుగుదేశం కుటుంబ సభ్యుడికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**హనుమాన్ జంక్షన్, మార్చి 29(వార్తాప్రభ)**తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు మేడేపూడి రామ్మోహన్ రావు పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరమాచనేని సత్యప్రసాద్, దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయి కళ్యాణి, మేడేపూడి రామ్మోహన్ రావు, వీరమాచినేని బుజ్జి, అట్లూరి శ్రీనివాస్ కలిసి 5 కిలోల తెలుగుదేశం కేకును కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నాల లక్ష్మీ నారాయణ,వరిగంజి కిషోర్, కాకుల శ్రీనివాసరావు, వడ్డిల్లి లక్ష్మీ,,గార్లపాటి రాజేశ్వరరావు,గొట్టాపు వాసు,కడగల శ్రీనివాస్, కర్రా ప్రసాద్ పాల్, హనుమంత్ నాగేశ్వరరావు,రాజులపాటి రుష్యారావు చెరుకూరి హరికృష్ణ .ఆళ్ల సురేష్ .పర్వతనేని నాగేశ్వరరావు.అల్లంశెట్టి శ్రీనివాసరావు తమిరి రమేష్,తాడిశెట్టి శ్రీనివాసరావు,కడవకొల్లు రాజేష్,కొమ్మిరిశెట్టి కుమార్,కంపసాటి కొండ, బోను ఉదయ్,పల్లగాని దుర్గ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పార్టీ స్థాపకులు నందమూరి తారక రామారావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు.

## ట్రంప్ చర్చలు అంటూనే.. దాడులకు సిద్ధం
# ఇరాన్ పార్లమెంట్ స్పీకర్



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పైకి మాత్రం చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు నటిస్తూనే.. రహస్యంగా భూతల దాడులకు సన్నాహాలు చేస్తున్నారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ ఆరోపించారు. అయితే.. తమ దళాలు వారి రాకకోసం ఎదురు చూస్తున్నాయని.. అమెరికా దళాలు అడుగుపెట్టగానే వారిని బూడిద చేస్తామంటూ హెచ్చరించారు. అమెరికా.. దాని ప్రాంతీయ మిత్ర దేశాలను దండిస్తామని హెచ్చరించారు. అమెరికాకు చెందిన 3,500 మంది మెరైన్లు నేడు సెంట్రల్ కమాండ్ పరిధిలోకి చేరుకొన్నారు. దీంతో ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకోబోతుందన్న ప్రచారం జోరందు కొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ పార్ల మెంట్ స్పీకర్ స్పందించారు.

**పరిహారం.. హర్మూజ్‌పై అధికారం ఇవ్వాల్సిందే: ఇరాన్**

మరోవైపు ఇరాన్‌ప్రభుత్వ ప్రతినిధి ఫాతేమ్ మొహజిరానీ కూడా చర్చలపై స్పందంచారు. తాము యుద్ధం మొదలు పెట్టలేదని.. ఇప్పుడు తీవ్రంగా నష్టపోతున్న దేశం కూడా తమదే అని వెల్లడించారు. ఏ చర్చల్లో అయినా నష్టపరిహారం అంశం కచ్చితంగా ఉండాల్సిం దేనని తేల్చిచెప్పారు. ఇక హర్మూజ్ జలసంధిపై తమ నియంత్రణ, ఆంక్షల తొలగింపు వంటివి కూడా చర్చల్లో కీలక విషయాలని వెల్లడించారు. సుస్థిర శాంతి కోసం అడుగులు వేస్తామన్నారు. ఆదివారం ఉదయం కూడా టెహ్రాన్‌పై భారీ స్థాయిలో బాంబింగ్ కొనసాగింది. ఈ విషయాన్ని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. దీనిలో తమ పౌరులు గాయపడినట్లు వెల్లడించింది. అయితే .. ఇజ్రాయెల్ మాత్రం తాత్కాలిక కమాండ్ సెంటర్, ఆయుధ తయారీ కేంద్రంపై దాడులు జరిగినట్లు వెల్లడించింది.


## అశ్వాపురం లో టీడీపీ 44 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.....

**శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు**

**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 29 :**(వార్తాప్రభ)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండల కేంద్రంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గల స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు... ముందుగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు... ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు, మేజర్ గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాష్ మాట్లాడుతూ...ముందుగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి..పార్టీ ఒక రాజకీయ వేదిక మాత్రమే కాదు ఇది కొట్లాది మంది తెలుగు వారి ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపం అన్నారు...సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్ళు.. అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రజల్లోకి వెళ్లిన తీరు భారత రాజకీయాల్లో ఒక అరుదైన ఘట్టం అన్నారు..పేద వారికి కూడు,గూడు,గుడ్డ ఇవ్వాలనే ఆయన సిద్ధాంతాన్ని సదా పాటిస్తున్నామని,టీడీపీ ఆవిర్భావం తర్వాతనే సమాజంలో అణగారిన, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామజికంగా గుర్తింపు వచ్చిందన్నారు. దేశానికి సంక్షేమం పరిచయం చేసింది మన పార్టీ అన్నారు..తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ ఆవిర్భావ దినోత్సవం అంటే మన ఇంటి పండుగ ఈ పండుగ సందర్భంగా ప్రతి కార్యకర్తకు పేరు పేరునా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తుళ్లూరి గంగా భవాని, కంసాని సురేష్, టీడీపీ వాసు, రాయల అరుణ, ఆచంట అనిత, సాయి ప్రకాష్, కొర్లకుంట శ్రీనివాస్, మల్లెల రమణ, త్రివేణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుండి నటుడు విజయ్ పోటీ



**చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం తమ పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు విజయ్ ఆదివారం ప్రకటించారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుండి విజయ్ తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగనున్నారు. పెరంబూర్ నుండి డిఎంకె ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్.డి.శేఖర్‌ను బరిలోకి దింపగా, అన్నాడిఎంకె నుండి అన్బుమణి పోటీ చేస్తున్నారు. మరోవైపు తిరుచ్చిఈస్ట్‌లో డిఎంకె ప్రస్తుత ఎమ్మెల్యే ఇనిగో ఇరుదయరాజ్ పోటీ చేస్తుండగా, అన్నాడిఎంకె కె.రాజశేఖరన్‌ను రంగంలోకి దింపింది.

## నేపాల్‌లో కొనసాగుతున్న
# 'మాజీ మంత్రుల' అరెస్టులు



**ఖాట్మాండు :** నేపాల్‌లో అరెస్టుల పర్వం కొన సాగుతోంది. గతేడాది సెప్టెంబర్‌లో జెన్ జెడ్ నిరసనల కారణంగా తలెత్తిన అల్లర్లు, ఘర్షణల్లో నిర్లక్ష్యపూరితమైన హత్యలకు పాల్పడ్డారన్న అభియోగాలపై నేపాల్ మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలి, మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన బాలేంద్ర షా నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయి. తాజాగా నేపాల్ మాజీ ఇంధన శాఖ మంత్రి దీపక్ ఖడ్కాను ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా దీపక్ ఖడ్కాను ఈ ఉదయం అరెస్ట్ చేసినట్లు సిబిఐ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. నేపాల్ మనీలాండరింగ్ దర్యాప్తు విభాగం ఈ విచారణను పర్యవేక్షిస్తోందని అన్నారు. సెప్టెంబర్ 9వ తేదీన నిరసనల సందర్భంగ ఖడ్కా నివాసం నుండి స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆదివారం ఉదయం ఆయనను అదుపులోకి తీసుకున్నారని కొత్త హోం వ్యవహారాల మంత్రి తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. సెప్టెంబర్ 8,9 తేదీల్లో జరిగిన నిరసనల అణచివేతలో సుమారు 76మంది మరణించినట్లు అల్లర్లపై ఏర్పాటైన విచారణ కమిషన్ పేర్కొంది.

## జై రామన్ 3డి స్టూడియో ప్రారంభోత్సవంలో బిజెపి నేత వడ్డేపల్లి



**కూకట్ పల్లి, మార్చి 29(వార్తాప్రభ):**కూకట్ పల్లి వివేకానంద నగర్‌లో జై రామన్ 3డి స్టూడియో ప్రారంభోత్సవం అద్భుతంగా, ఘనంగా జరిగింది.సీతారామయ్య ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకస్టమర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన, ఆధునిక సాంకేతికతతో కూడిన 3ఐ ఫోటోగ్రఫీ సేవలు అందించాలని స్టూడియో నిర్వాహకులను కోరారు. కాలనీవాసులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లాభపడాలని ఆకాంక్షించారు.ప్రారంభోత్సవ వేడుకలో స్థానికులు, అభిమానులు, పలు ప్రముఖులు పాల్గొనడంతో కార్యక్రమం మరింత ఉత్సాహంగా సాగింది.

## కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా సెక్రటరీ గా ఆకారం రమేష్...

**మందమరి పట్టణానికి చెందిన ఆకారం రమేష్ డిసిసి సెక్రెటరీ గా నియమితులయ్యారు.**



**మందమర్రి మార్చి 29(వార్తాప్రభ)**గతంలో , ఎన్. ఎస్. యు. ఐ. యూత్ కాం గ్రెస్ విభాగాల్లో చు రుగ్గా పాల్గొని 2023 ఎన్నికల్లో వివేక్. గెలుపులో కీలక పాత్ర పోషించారు.ఈ సందర్భంగా ఆకారం రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్నటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ మరింత బలోపేతం అయ్యేం దుకు కృషి చేస్తానని అన్నా రు. నా మీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర మంత్రివర్యులు.వివేక్ వెంకటస్వామి , పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ , డీసీసీ. అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## హిందూ సమ్మేళనం సమితి (జాగృతి ) రమేష్ ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు



కామారెడ్డి **మార్చి 29(వార్తాప్రభ)**కామారెడ్డి లోని కల్కి నగర్ హిందూ సమ్మేళనం సమితి (జాగృతి )కి రైస్ మిల్లర్ మరియు ప్రముఖ వ్యాపారవేత అయినా ఆమెటి రమేష్ ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. వీరికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పక్షాన మరియు ఛాంబర్ ఆఫ్ కామర్స్ పక్షాన అభినందనలు కంగ్రాట్యులేషన్స్ తెలిపారు.

## జమియత్-ఎ-హఫ్ఫాజ్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమం




**కరీంనగర్, మార్చి 29(వార్తాప్రభ)** కరీంనగర్ నగరంలోని ముకర్రంపురాలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో జమియత్-ఎ-హఫ్ఫాజ్ అధ్యక్షుడు ఖాజీ అహ్మద్ మంక్బత్ షా ఖాన్ అధ్యక్షతన ఒక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ఫాదర్ క్రిస్టోఫర్ - ఎం ఆర్ ఓ ఈ నరేంద్ర పాల్గొన్నారు. ఈ ఈద్ మిలాప్ కార్యక్రమంలో నగర ప్రముఖులతో పాటు దేశంలోని ముస్లిమేతర సోదర సోదరీమణులు కూడా పాల్గొన్నారు. దేశ సోదర సోదరీమణులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జమియత్-ఎ-హఫ్ఫాజ్ చేపట్టిన సామాజిక సంక్షేమ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, వైద్యులు, ఇంజనీర్లు, మత పెద్దలు పాల్గొన్నారు. జమియత్-ఎ-హఫ్ఫాజ్ అతిథులకు విందు భోజనం మరియు షేర్-ఎ-ఖోర్మాను అందించింది. ఈ కార్యక్రమంలో జమియత్ హఫాజ్ అధికారులు హఫీజ్ జియావుల్లాఖాన్, హఫీజ్ మోజామ్ హుస్సేన్, హఫీజ్ వసీముద్దీన్, హఫీజ్ రిజ్వాన్ ఫలాహి, హఫీజ్ సాదిఖ్ అలీ అహ్మద్, హఫీజ్ ముదస్సర్ ఉర్ రెహమాన్, హఫీజ్ ఫరీదుద్దీన్, వసీమ్ మహ్మద్, హఫీజ్ వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం గడ్డపై కరాటే హుంకర్!!

● "గ్రాండ్"గా విక్టరీ షోటోకన్ బెల్టుల ప్రదానోత్సవం ● 160 మంది విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన
● కరాటేతోనే శారీరక, మానసిక దృఢత్వం ● రంగు మల్లికార్జున్ గౌడ్





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆదివారం నాడు కరాటే విద్యార్థుల విన్యాసాలతో మార్మోగింది. విక్టరీ షోటోకన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టుల ప్రదానోత్సవం క్రమశిక్షణకు, ఆత్మరక్షణ విద్యకు నిలువుటద్దంగా నిలిచింది. ఎన్టీపీసీ, గోదావరిఖని పరిసరాల నుండి తరలివచ్చిన దాదాపు 160 మంది విద్యార్థులు తమ అద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శించగా, ఉదయం నుంచే వారి కఠోర సాధనను పరీక్షించిన కోచ్‌లు అర్హతను బట్టి వివిధ స్థాయిల బెల్టులను, ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు రంగు మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ కరాటే కేవలం ఒక యుద్ధ విద్య మాత్రమే కాదని, అది శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని ఇచ్చే జీవన విధానమని పేర్కొనగా, ముఖ్య అతిథులుగా విచ్చేసిన కోమాకుల సదాశివుడు, మల్యాల రామస్వామితో పాటు కార్పొరేటర్లు అసిఫ్ పాషా, మడిపల్లి విజయ మల్లేష్, మమతా కుమారస్వామి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. పోలీసు అధికారులు ఉదయ్, రామకృష్ణ, వైద్యులు గోపికాంత్ వంటి ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో గురువులు సురేష్, రాము, చంద్రశేఖర్, రమేష్, లక్ష్మణ్, నవీనా విద్యార్థులను తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. తమ పిల్లలు కరాటే దుస్తుల్లో మిరుమిట్లు గొలుపుతూ బెల్టులు అందుకుంటుంటే తల్లిదండ్రులు ఆనందోత్సాహాలతో వారిని ఉత్సాహపరచడం అక్కడి వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది. చిన్నారుల క్రమశిక్షణ భవిష్యత్తులో వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్న ఆకాంక్షతో ఈ కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# అంతా నా ఇష్టం అంటున్న అధికారి మాకొద్దు

● మెప్మా టీఎంసీ చంద్రశేఖర్‌పై తీవ్ర ఆరోపణలు ● అవినీతి, అధికార దుర్వినియోగం, సిబ్బందిపై వేధింపుల పర్వం ● విచారణ కోరుతున్న బాధితులు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం : మెప్మా విభాగంలో పనిచేస్తున్న టీఎంసీ చంద్రశేఖర్‌పై పలు తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైనప్పటికీ, తిరిగి విధుల్లోకి చేరిన విధానం, ప్రస్తుతం వ్యవహరిస్తున్న తీరు పట్ల సిబ్బంది మరియు సంబంధిత వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. సంబంధిత శాఖ నుండి అందిన సమాచారం ప్రకారం 2021లో సుమారు రూ.3.5 లక్షల అవినీతి కేసులో ఆరోపణలు రుజువై, అధికారుల కమిటీ నివేదిక ఆధారంగా అప్పటి జిల్లా కలెక్టర్ ఆరు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. కాగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే ఉద్యోగి ఒకసారి అవినీతి నిరూపితమైతే తిరిగి విధుల్లోకి తీసుకోవడం కుదరదని నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కి సదరు అధికారి తిరిగి విధుల్లో చేరడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలను పక్కన పెట్టి అధికారులను ప్రభావితం చేసి విధుల్లోకి చేరారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై వివరణ కోరగా సమాధానం దాటవేస్తు వచ్చిన అధికారులు నేడు "కొత్తగా రిక్రూట్ చేశాం"అనే వివరణను అధికారులు ఇవ్వడం గమనార్హం. కాగా సదరు నియామకానికి సంబంధించి ఎటువంటి అధికారిక నోటిఫికేషన్ లేకపోగా కనీసం ఒక్క పేపర్ లో ప్రకటన ఇవ్వకపోవడం కొసమెరుపు...

**సిబ్బందిపై వేధింపులు - వర్గాల మధ్య విభేదాలు** ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల పరిధిలో సిబ్బందితో తరచు గొడవలు సృష్టిస్తూ, కొందరిని లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్పీలు, సిబ్బంది మధ్య విభేదాలు రేకెత్తించడంలో ఆయన పాత్ర ఉందని బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. కొంతమంది అవినీతి ఆరోపణలు ఉన్న ఆర్పీలకు మద్దతు ఇస్తూ, మిగిలిన సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారని, అలాగే వ్యక్తిగత విభేదాల కారణంగా కొందరిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**పాల్వంచ అవినీతి కేసులో జోక్యం ?** పాల్వంచలో జరిగిన ఒక పెద్ద అవినీతి వ్యవహారంలో సంబంధిత అధికారిని కాపాడేందుకు, ఫీల్డ్ స్థాయి సిబ్బందిని నియంత్రిస్తూ, వారి విధులను అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఓ ఆర్పీపై కక్ష సాధింపు చర్యలు** తనకు సస్పెండ్ కు కారణమనే అక్కసుతో కొత్తగూడెంలో ఒక ఆర్పీని తొలగించేందుకు గత ఆరు నెలలుగా లెక్కల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని మెప్మా సిబ్బంది ముక్తకంఠంతో చెబుతున్నారు. ఈ చర్యలకు వ్యక్తిగత కక్షలే కారణమని ఆరోపిస్తున్నారు. అయితే ఇదే క్రమంలో ఒక ఆర్పీకి అసాధారణ ప్రాధాన్యత ఇస్తూ, కార్యాలయ నిర్వహణలో కీలక పాత్ర అప్పగించారని, సమావేశాల నిర్వహణ నుంచి వేతనాల విడుదల వరకు ఆమె ప్రభావం చూపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో, ఒక వ్యక్తి రెండు చోట్ల నుంచి వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై స్పష్టత ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నారు.

**జిల్లా అధికారులకు ఫిర్యాదులు** ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి సిబ్బంది గౌరవ అదనపు కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విశ్వసనీయ సమాచారం. దీంతో అధికారుల వైఖరిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్ని ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలు ఏమిటో వెల్లడించాలని, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బాధిత సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

# బీజేపీ కేడర్‌లో నూతనోత్తేజం!!

● లక్ష్యం - సంస్థాగత బలోపేతం ● రామగుండం గడ్డపై కాషాయ జెండా రెపరెపలే ధ్యేయం
● దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనే బాట ● జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి
● నియోజకవర్గ ఇంచార్జి కందుల సంధ్యారాణి



**పెద్దపల్లి: మార్చి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**భారతీయ జనతా పార్టీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ ఆధ్వర్యంలో బసంత్ నగర్ వేదికగా అంతర్గాం, పాలకుర్తి మండలాల ప్రశిక్షణ శిబిరం అత్యంత క్రమశిక్షణతో నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ రెడ్డి, రామగుండం నియోజకవర్గం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించగా, పార్టీ కార్యకర్తల్లో సైద్ధాంతిక స్పష్టతను పెంపొందించడం, సంస్థాగత బలోపేతమే ప్రధాన లక్ష్యంగా ఈ శిబిరం సాగింది. గ్రామీణ స్థాయిలో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేయడం, సామాన్య ప్రజలతో నిరంతరం మమేకం కావడం మరియు దేశ నిర్మాణంలో పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేరవేయడంపై వక్తలు సమగ్రమైన మార్గదర్శనం చేశారు. ముఖ్యంగా సేవా భావాన్ని అలవర్చుకోవడం ద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాలకు పార్టీని మరింత చేరువ చేయాలని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, బూత్ స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ శిక్షణలో భాగంగా కార్యకర్తల సందేహాలను నివృత్తి చేస్తూ, క్రమశిక్షణతో కూడిన రాజకీయ ప్రయాణం ఎలా ఉండాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని శిక్షణను విజయవంతం చేశారు. అందరి సమిష్టి కృషితోనే పార్టీ బలోపేతం సాధ్యమని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ శిక్షణా శిబిరం కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపి, పార్టీ భావజాలాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి ఒక వేదికగా నిలిచింది. ప్రశిక్షణ జిల్లా కన్వీనర్ గొట్టిముక్కల సురేష్ రెడ్డి, వర్గ ప్రభారి కందుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శనిగరపు రమేష్ లు పాల్గొని పార్టీ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. ఈ శిబిరంలో అమరగోని ప్రదీప్, వెంకటకృష్ణ, పరికిపండ్ల మల్లీశ్వరి, సుభాష్, తిప్పని రాజకుమార్ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సంఘం నగేష్, పూసాల శంకరయ్య, బొడ్డు రాయమల్లు, కండె సాగర్, మేదం రాజు, గోపు రామన్న, గండికోట కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్తు ఆర్టిజన్ల మహా ధర్నాను విజయవంతం చేయండి

**కామారెడ్డిమార్చ్ 29 (వార్తాప్రభ ప్రతినిధి)** కామారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం ముందు 30 వ,తేదీ సోమవారం నాడు, తెలంగాణ ఆర్టిజన్ జేఏసీ, పిలుపుమేరకు, ఆర్టిజన్ల, హన్మేన్ల, సిఎల్. మీటర్ రీడింగ్ కార్మికుల, శాంతియుత మహాధారణను విజయవంతం చేయాలని, జిల్లా జాక్ నాయకులు. ఎం. నాంపల్లి.కే. బాలేశం.సునీల్. లు, కార్మికులకు పిలుపునిచ్చారు. ఇట్టి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ పోరాటం విద్యుత్ కార్మికుల, బతుకు పోరాటమని, గత 20-- 25 సంవత్సరాల నుండి, చాలీచాలని వేతనాలతో, కుటుంబాన్ని పోషించలేని దీనస్థితిలో ఉన్నామని. అన్నారు.

## ఎం ఎన్ ఆర్ ఫౌండేషన్ ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరం



**విస్సన్నపేట మార్చి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలోని వికాస్ మెయిన్ క్యాంపస్ నందు ఎంఎన్ఆర్ ఫౌండేషన్ శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్త సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఫౌండర్ ఎం నాగేశ్వర్రెడ్డి నిర్వహించారు. టిడిపి రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దె ), తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, మైలవరం ఏఎంసీ వైస్ చైర్మన్ చేబ్రోలు రాజు, మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, విస్సన్నపేట మాజీ సర్పంచ్ కుక్కడపు ప్రసాదరావు,రెడ్డిగూడెం మండల టిడిపి ప్రెసిడెంట్ వేణుగోపాల్ రెడ్డి, జంపాల సీతారామయ్య, కొప్పిరెడ్డి అశోక రెడ్డి, చేబ్రోలు కృపా రాజు, కొల్లి శ్రీనివాస్ రెడ్డి, సుబ్బారెడ్డి, రెడ్డిగూడెం వికాస్ ప్రిన్సిపాల్ డి ఎస్ ఆర్ తదితరులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. 129 మందికి పరీక్షలను నిర్వహించి 29 మందిని ఆపరేషన్ చేసేందుకు ఎంపిక చేయడం జరిగిందని కొందరికి మందులను అందజేశామని చెప్పారు.

## కాల్పుల విరమణపై పాకిస్థాన్‌లో చర్చలు



అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కోసం ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. పాకిస్థాన్ ఆధ్వర్యంలో సౌదీ అరేబియా, తుర్కియే, ఈజిప్ట్ ఇప్పటివరకు ఇరు వర్గాలతో ఫోన్‌ల ద్వారా చర్చలు జరపగా.. ఆది, సోమవారాల్లో ప్రత్యక్షంగా భేటీకానున్నాయి. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఆహ్వానం మేరకు సౌదీ విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్, తుర్కియే మంత్రి హకాన్ ఫిదాన్, ఈజిప్ట్ మంత్రి బద్ర్ అబ్దెలాట్టీ శనివారమే పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు చేరుకున్నారు. పాక్ ప్రధాని షెహబాజ్ శనివారం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు ఫోన్ చేసి చర్చించారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

**- ఆర్డీవో రామ్మోహనరావు**



**బొబ్బిలి, మార్చి 29** (వార్తా ప్రభ ప్రతినిధి). లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్డీవో రామ్మోహనరావు అన్నారు. బొబ్బిలి డివిజన్ పరిధిలో లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టం అమలు తీరుపై వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పురుష సంతాన ప్రాధాన్యం, ఆడపిల్లలపై వివక్ష, మూఢ నమ్మకాలు తదితర వాటి నేపథ్యంలో గర్భస్థ శిశువు ఆడ అని తేలితే గర్భ స్రావాలు చేయించుకోవడం నేరమన్నారు. 0-6 సంవత్సరాల బాలికల లింగ నిష్పత్తిని పెంచ డానికి ప్రభుత్వం లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తోందన్నారు. ఈ చట్టం ద్వారా లింగ నిర్ధారిత ఆడ శిశువుల భ్రూణ హత్యలను నిరోధించేందుకు ఈ చట్టం అత్యధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.

## అందుబాటులోకి భద్రగిరి మార్ట్....!

**-ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్.**

**-హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**

**భద్రాచలం మార్చి 29, (వార్తా ప్రభ ప్రతినిధి).**,స్థానికుల ప్రయోజనార్థం ఎంతో దూర దృష్టితో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ కృషి తో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శనివారం ఈ మార్టును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్ట్ లోని అటవీ ఉత్పత్తులను గవర్నర్ పరిశీలించారు. ప్రజా ఉపయోగకర అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్ లో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయని ఇందుకు కృషి చేసిన ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ని గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ను కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయం తో ఏర్పాటు చేసిన ఈ మార్టును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, ఇప్పటికే ట్రైబల్ మ్యూజియం వంటి వినూత్న కార్యక్రమాలతో గుర్తింపు పొందిన పిఓ రాహుల్ భద్రగిరి మార్ట్ అందుబాటులోకి తేవడంతో మరో మైల్ రాయిగా నిలుస్తుందని, గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడం, అలాగే వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, భద్రాచలం ప్రజలు గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి, గిరిజన ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళలు, గిరిజన రైతులకు ఆర్థికంగా చేయూత అందించాలని ఆయన అన్నారు

# రక్తదానం చేయండి...ప్రాణ దాతలు కండి

## -కోరంగి సబ్ ఇన్స్పెక్టర్ పి. సత్యనారాయణ




**తాళ్లరేవు, మార్చి 29 (వార్తాప్రభ) :** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరంగి పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి. సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం, పటవల గ్రామ పంచాయితీ పరిధిలోని పటవల గ్రామంలో "నిఘావార్త" తెలుగు దినపత్రిక కేంద్ర కార్యాలయం.. "అశోక్ ఎస్టేట్" ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. "నిఘావార్త" ఎడిటర్,చైర్మన్ ఎన్ ఎం ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో.. ఆయన తండ్రి ఎన్. నాగభూషణం ఆరవ మెమోరియల్ సర్వీసు సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు రాజమహేంద్రవరం శాఖచే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కోరంగి పోలీసు స్టేషన్ ఎస్ఐ పి. సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ట్రస్టు చేపట్టిన సేవా కార్యక్రమాలలో భాగంగా.. నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంకు ద్వారా సేకరించిన రక్తాన్ని తలసేమియా పేషెంట్లకు ప్రాణం పోస్తుందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తం దానం చేస్తే మరో వ్యక్తికి ప్రాణం పోసినట్లేనని ఎస్ఐ స్పష్టం చేశారు. ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపులో తీసుకున్న రక్తాన్ని తలసేమియా పేషెంట్లు అయిన చిన్నారులకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా సంబంధిత వ్యాధిగ్రస్తులకు అందించడం జరుగుతుందని బ్లడ్ బ్యాంకు మేనేజ్మెంట్ పేర్కొంది. ఈ క్యాంపు కాకినాడకు చెందిన న్యాయవాది విడియాల శివ ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని వారి రక్తాన్ని దానం చేశారు. నిర్వాహకులు ప్రసంగిస్తూ.. భవిష్యత్తులో మరింత మంది సేవా కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.ప్రముఖ పారిశ్రామికవేత్త చల్లా శ్రీరామచంద్రమూర్తితో పాటు ఎస్. నాని,అంజి,పి.ప్రసాద్,డి. వినయ్ కుమార్,పీవీఎస్ఎన్ మూర్తి,ఎస్. సునీల్ కుమార్, టి.నవీన్ కుమార్, కే .అనిల్ కుమార్, ఎస్ .గణ సాయి, జి .సత్యనారాయణ, పి ఆనంద్,ఎన్ శ్రీనివాసరావు, ఎం. జగదీష్, డి. ప్రేమ్ స్వరూప్, దైవ ఆనంద్,వాసంశెట్టి బాలకృష్ణమూర్తి తదితరులు రక్తదానం చేశారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్ ఘనంగా తెదేపా 44వ ఆవిర్భావ దినోత్సవం



**కాకినాడ రూరల్/కరప,మార్చి 29 (వార్తాప్రభ) :** తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు,సంక్షేమ పథకాలకు ఆద్యుడు నందమూరి తారకరామారావు ఆశయాలే నేటికీ తెలుగుదేశం పార్టీకి మార్గదర్శకాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు కొనియాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప,నడకుదురు, చీడిగ,స్వామి నగర్, ఇంద్రపాలెం తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు,డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పార్టీ జెండాలను ఆవిష్కరించి,ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నడకుదురులోని జనావళి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు.సినిమా రంగంలో మకుటం లేని మహారాజుగా వెలుగుతున్న సమయంలోనే,ఆ సంపదను,కీర్తిని పక్కన పెట్టి కేవలం తెలుగు జాతి అభ్యున్నతి కోసమే ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చారని నాయకులు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విప్లవాత్మక నిర్ణయాలతో సంక్షేమ రాజ్యానికి ఆయన పునాది వేశారని, అవినీతి రహిత సమాజం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఎన్టీఆర్ వేసిన బలమైన పునాది కారణంగానే పార్టీ నేటికీ చెక్కుచెదరకుండా ఉందని,ఆయన బాటలోనే నారా చంద్రబాబు నాయుడు పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నారని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవు వెంకన్న,గీసాల వెంకటేశ్వరరావు, పితాని అప్పన్న,కొండ వినాయక్, కె. సీతామహాలక్ష్మి,కోనా వెంకటలక్ష్మిమేడిశెట్టి అప్పల స్వామి,అనిశెట్టి గంగాధర్,కొండేపూడి పాండవులు తదితరులు పాల్గొన్నారు.

# బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కోడూరు,మార్చి 29 (వార్తాప్రభ) :** స్థాపించిన తొమ్మిది నెలలలోనే అధికారంలోకి వచ్చిన మహోన్నత పార్టీ తెలుగుదేశం పార్టీ అని అవనిగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం కోడూరు పార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత నందమూరి తారక రామారావు చిత్రపటానికి పార్టీ సీనియర్ కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి నిరంతరం పార్టీ కోసం పాటుపడే నాయకులను, కార్యకర్తలను కనపర్తి శ్రీనివాసరావు, బండే శ్రీనివాసరావు పూలదండలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మేరకగౌడపాలెం గ్రామంలో, దింటిమేరక గ్రామంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కనపర్తి శ్రీనివాసరావు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పేద ప్రజల కనీస అవసరాలు అయినా కూడు గూడు గుడ్డ అనే నినాదంతో పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి తీసుకు వచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని చరిత్ర ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీ ఉంటుందని చరిత్రను తిరగ రాసిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ నేనని అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నరు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి ప్రజలకు, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# ఐ.ఎం.ఎల్ పాలీ కంటైనర్స్ ఫ్యాక్టరీని ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**ఎ.జి.కొండూరు,మార్చి 29 (వార్తాప్రభ) :** మండలంలోని కుంటముక్కల గ్రామ శివారులో కొత్తగా నిర్మించిన ఐ.ఎం.ఎల్ పాలీ కంటైనర్స్ ఫ్యాక్టరీని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ఆదివారం ప్రారంభించారు.వివిధ పాల ఉత్పత్తులను ప్యాకింగ్ చేసేందుకు ఈ ప్లాస్టిక్ కంటైనర్లను వినియోగించనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు,ఫ్యాక్టరీ యాజమాన్యం, స్థానిక కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ గ్రామాన టిడిపి ఆవిర్భావ దినోత్సవ సంబరాలు



**విస్సన్నపేట,మార్చి 29 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో రాష్ట్ర టిడిపి పార్టీ ఆదేశాల ప్రకారం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు గ్రామ గ్రామాన జరిగిన పార్టీ ఆవిర్భావ సంబరాలలో పాల్గొన్నారు. కొండ పర్వ, తాత కుంట్ల,నరసాపురం, మారె మండ, వేమిరెడ్డిపల్లి కొర్లమండ కలగర పుట్రెల తెల్లదేవరపల్లి చంద్రుపట్ల విస్సన్నపేట తదితర గ్రామాలలో పార్టీ ఆవిర్భావ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు. పుట్రెల అరిగే శ్రీనివాసరావు, కొండ పర్వ మట్టా వేణుగోపాలరావు, మహేష్ శ్రీ శ్రీ ఆర్ పి, శివ సత్యనారాయణ, తాత కుంట్ల పులపాక శ్రీనివాసరావు, వీరమాచనేని కృష్ణ ప్రసాద్, నరసాపురం గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, నాగరాజు, విస్సన్నపేట రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దె), జిల్లా నాయకులు నెక్కలపు శ్రీనివాసరావు (డాబా శ్రీను ) కొంగల శ్రీనివాసరావు, మర్రిబోయిన వెంకటేశ్వరరావు( చిన్నోడు )మాగంటి నాని (సత్యనారాయణ చౌదరి ) గిరి రెడ్డి, మారెమండ నందమూరి శ్రీరామచంద్ర తదితరులు పాల్గొన్నారు. కలగర గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్బవం దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కలగర పంచాయతీ లోని సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల తో జెండా ఆవిష్కరణ చేయించడం జరిగింది.అనంతరం పార్టీ ఆవిర్బవం నుండి తెలుగుదేశం పార్టీ కి అండగా నిలబడిన సీనియర్ నాయకుల ను కార్యకర్తలు ను సన్మానం చేశారు. గరిమెళ్ల భాస్కరరావు, తెలుగు యువత జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి తుమ్మల పల్లి అనిల్,సెక్రటరీ పంది మారేశ్వరావు, నిగమాను శ్రీనివాసరావు, తుమ్మలపల్లి చెన్నారావులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి ఆద్యుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు

● రామచంద్రపురంలో రెపరెపలాడిన పసుపు జెండా ● టిడిపి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు

**రామచంద్రపురం,మార్చి 29 (వార్తాప్రభ) :** రామచంద్రపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం నాయకత్వంలో, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో పార్టీ జెండాను ఎగరవేసి, కేక్ కట్ చేసి, భారీగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి సేవలను స్మరించుకుంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ అనతి కాలంలోనే అధికారంలోకి రావడం గొప్ప చరిత్రగా నిలిచిందని నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజారంజక, అభివృద్ధి పరిపాలన అందిస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. కోటి మంది సభ్యులు ఉన్న అతిపెద్ద పార్టీగా తెలుగుదేశం ఆవిర్భవించిందని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ , తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, సలాది నాయుడు



మాస్టర్, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, విత్తనాల రమణ, మేడిశెట్టి సూర్యనారాయణ, గడి గోవిందు, కట్టా నాగేశ్వరరావు, కేతా శ్రీను, కేతా సుజాత, నారుపురెడ్డి బలరాం, వాసంశెట్టి చంద్రశేఖర్, ఏసుదాసు, బళ్ల లక్ష్మి, బల్ల శివ, వాసంశెట్టి బాల, పడాల బాబీ, ప్రకాష్, అల్లం శ్రీనివాస్, పదమూర్తి, సత్తిబాబు, గిరి, (బట్టల షాపు) సిరిగినీడి దుర్గాప్రసాద్, లంకే శ్రీను, మనోజ్ పలువురు నాయకులు , కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వాడపల్లి వేంకన్న రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**వాడపల్లి,మార్చి 29 (వార్తాప్రభ) :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి రథోత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి స్వామివారి దివ్య రథోత్సవంలో పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, పాలకమండలి సభ్యులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు తదితరులతో కల్సి రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వాడపల్లి వీధులన్నీ గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి.

# శ్రీ తిరుపతమ్మ సన్నిధిలో హిందూ ధార్మిక సేవా సమితి అధ్యక్షులు



**పెనుగంచిప్రోలు, మార్చి 29 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని ఆదివారం హిందూ ధార్మిక సేవా సమితి అధ్యక్షులు శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానముకి విచ్చేసి ఆలయం లో శ్రీ దేవి భాగవత తత్వం ప్రవచనాలు నిర్వహించి అనంతరం అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి మహేశ్వర రెడ్డి మరియు అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు మర్రే బోయిన గోపి బాబు మరియు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

# ఆర్జీయూకేటీ నూజివీడులో ఐ క్యాంప్...



**నూజివీడు,మార్చి 29 (వార్తాప్రభ) :** ఆర్జీయూకేటీ నూజివీడులో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడింది. నూజివీడు బ్యాంక్ స్ట్రీట్ లో ఉన్న సుమన్ కంటి ఆసుపత్రి వైద్య బృందం డా. కిరణ్మయి, డా. అశోక్ రాజ పురోహిత్, డా. రాంబాబు ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. చూపు మసకబారడం, కళ్ళల్లో నీరు కారడం, కళ్ళల్లో ఎరుపుదనం రావడం, తరచూ తలనొప్పులు రావడం లాంటి కంటి సంబంధిత సమస్యలను ప్రాథమికంగా పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడమే కాక విద్యార్థులకు అవసరమైతే నాణ్యమైన కళ్ళజోళ్ళను, కంటి శుక్లాల ఆపరేషన్, లేజర్ ట్రీట్మెంట్ మొదలైన వాటిని అతి తక్కువ ధరలో అందించడానికి సిద్ధమని వైద్య శిబిర నిర్వాహకులు తెలియజేశారు. నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాల రాజు స్వయంగా ఈ శిబిరాన్ని సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పరిపాలనాధికారి డా.లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి, డిఎస్డబ్ల్యు బాయ్స్ అండ్ గర్ల్స్ డా.రాజేష్, డా. దుర్గా భవాని, క్యాంపస్ హెల్త్ సెంటర్ వైద్యులు ఈ శిబిరాన్ని పర్యవేక్షించారు. విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో కంటి పరీక్షలు చేయించుకుని ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...



**పెనుగంచిప్రోలు,మార్చి 29 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం.లోని అనిగండ్లపాడు గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి, తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు,అనిగండ్లపాడు గ్రామ పెద్దలు సోసైటీ అధ్యక్షులు అత్తు లూరి అచ్యుత రావు మాట్లాడుతు స్వర్గీయ నందమూరి తారక రామారావు కృషిని, తెలుగుదేశం పార్టీ స్థాపించి 9 మీది నెలల్లో రాష్ట్రం లో అధికారం చెబునిన్న వ్యక్తి యుగ పురుషూడు నందమూరి తారక రామారా వు ఆయన బడుగు బలహీన వర్గాల ప్రజల కుచేసిన సేవలను కొనియాడారు, ఈ కార్యక్రమం లో గ్రామ పార్టీ అధ్యక్షులు వల్లంకొండ నరసింహారావు, ఎంపీటీసీ పొందూరు విజయలక్ష్మి, పొందూరు వెంకటేశ్వరరావు, షేక్ సోనిమియా, తొట్టెంపూడి మురళి, గంగోరి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

● పాస్టర్ జోసెఫ్ పాల్ ఆధ్వర్యంలో సంఘస్తులు ర్యాలీ..



**పెనుగంచిప్రోలు,మార్చి 29 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని జేజీఎం సంఘం ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు – –పాస్టర్ జోసెఫ్ పాల్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘస్తులు ర్యాలీ, పెద్ద ఎత్తున ఏసుక్రీస్తు సంకీర్తనలు పాడుకుంటూ గ్రామం లో ప్రధాన రహదారి మట్టల పండుగ సందర్భంగా మట్టల ఆదివారం వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జేజీఎం సంఘం ఆధ్వర్యంలో సంఘ పెద్దలు, సంఘ విశ్వాసులు సండే స్కూల్ పిల్లలు కలిసి గ్రామం లో పురవీధుల్లో పూలతో అలంకరించిన మట్టలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు భక్తి గీతాలు ఆలపిస్తూ,క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే పామ్ సండే, ఈస్టర్ పండుగకు వారం రోజుల ముందు జరుపుకుంటారు. శ్రమలకాలం (లెంట్ డేస్) లో వచ్చే యేసుక్రీస్తు యెరూషలేములో ప్రవేశించిన సందర్భాన్ని గుర్తుచేస్తూ భక్తి భావంతో జరుపుకుంటారు.ఈ కార్యక్రమంలో సంఘ పాస్టర్లు సంఘ పెద్దలు సంఘవిశ్వాసులు సంఘం నాయకులు సంఘ యవనస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సేవకు బ్రాండ్ అంబాసిడర్లు వారే



**విస్సన్నపేట,మార్చి 29 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం ఏప్రియల్ రెండవ తేదీన పదవీ విరమణ చేయనున్న సర్పంచులు దిగిపోతున్నాం మాకు ఏమిటి అని అనుకోకుండా ఆఖరి నిమిషం వరకు మేము సైతం ప్రజాసేవలో అన్న చందంగా సేవలు అందిస్తున్న వైనం తెలియ వచ్చింది. కలగర గ్రామపంచాయతీ సర్పంచ్ దేశి రెడ్డి రమా శ్రీనివాసరెడ్డి దళితవాడ ప్రజానీకానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన త్రాగునీరు సరఫరా ఆగిపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీరు అందించేందుకు యుద్ధపాతిపదిక చర్యలు తీసుకున్నారు. ఈస్టర్ పండుగ కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు అందించే కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. నరసాపురం గ్రామంలో ఆదివారం సైతం గ్రామ సర్పంచ్ నాగమణి ఆదేశాల మేరకు మినరల్ వాటర్ అందిస్తూ ఉండటం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. 48 గంటలలో పదవీ విరమణ చేస్తున్న సర్పంచులు ప్రజా సేవే లక్ష్యంగా సమయస్ఫూర్తితో వ్యవహరించటం సర్వత్ర హర్షణ వ్యక్తం చేస్తున్నారు.

# తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులకు, కార్యకర్తలకు, వీరాభిమానులకు పాదాభివందనాలు

● తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ స్థాపించిన పసుపు జెండా నాలుగున్నర శతాబ్దాల ప్రస్థానంలో రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తోంది.

● ఈ స్ఫూర్తితో పార్టీ జెండా ఎగురవేస్తూ, ఐక్యతగా ముందుకు సాగుదాం జైతెలుగుదేశం ! జైతెలుగుదేశం ! జైతెలుగుదేశం ! ● రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...



**ఏలూరు/నూజివీడు,మార్చి 29 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలో పోతిరెడ్డిపాడు టర్నింగులో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వర్గీయ శ్రీనందమూరి తారకరామారావు విగ్రహాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా బయలుదేరి పోతిరెడ్డిపాడు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.గ్రామ టిడిపి కార్యాలయంను ప్రారంభించి, జ్యోతిప్రజ్వలన చేసి బహిరంగ సభను మంత్రి ప్రారంభించారు. ఏ తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా మంత్రి కొలుసు పార్థసారథితో పాటు బహిరంగ సభకు హాజరు అయిన వారందరూ తిలకించారు.ఏ పార్టీకోసం కష్టపడిన నాయకులకు కార్యకర్తలకు మంత్రి ఘనంగా సన్మానించారు. సభకు హాజరైన వారందరీ చేత ప్రతిజ్ఞను మంత్రి చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ 1982 మార్చి 29 తేదీన తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ, 35 వేల కిలోమీటర్లు నందమూరి హరికృష్ణ చైతన్య రథం సారథిగా రాష్ట్ర మంతా ప్రజలు కష్టసుఖాలను తెలుసుకుంటూ పర్యటిస్తూ, కనీసం ఇంట్లో తన కుమారుడు వివాహానికి కూడా హాజరు కాలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజలు ఇచ్చిన అధికారంతోనే తిరిగి ఇంటికి వెళ్తానని ప్రతిజ్ఞ చేసి, కేవలం తొమ్మిది నెలల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి తిరిగి ఇంటికి వెళ్ళి సంచలనాలు సృష్టించారని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, పసుపుజెండాను గుండెల్లో పెట్టుకున్న నాయకులకు, కార్యకర్తలకు, వీరాభిమానులకు హృదయ పూర్వక వందనాలు, అభి అభినందనలు తెలియ జేస్తున్నామని అన్నారు. 2019-24 లో గత ప్రభుత్వ పాలనలో అన్ని అన్ని వ్యవస్థలు విధ్వంసాలు, అరాచక పాలన సాగిందని అన్నారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే చెల్లిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి, అరాచక పాలనతో రాష్ట్రాన్ని మరో 20 సంవత్సరాలు వెనక్కి నెట్టారని అన్నారు. తెలుగుదేశం సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో పార్టీ జెండా ఆవిష్కరణ, వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. మన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాలల్లో మన తెలుగువాళ్ళు, ఎన్టీఆర్ అభిమానులు ఉన్నచోట అంతా ఒక పండగ వాతావరణంలో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు శ్రీనందమూరి తారక రామారావు ఆశయాలను కొనసాగిస్తూ, రాష్ట్ర ప్రజలు ఆకాంక్షలను నెరవేర్చే దిశగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, నాయకులు, వీరాభిమానులు, కార్యకర్తలు, వివిధ గ్రామాలు తరలివచ్చిన ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పి ఆర్ సి కమిటీ చైర్మన్ ను నియమించండి

● పదవి విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించాలి

● వ్యవసాయ శాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతాం




**విజయవాడ,మార్చి 29 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వేతన సవరణ కమిటీ చైర్మన్ నియామకం జరపాలని, వేతన స్వరమా తృతీయతను పూర్తి చేయాలని, ఇప్పటికే రెండున్నర సంవత్సరాల పైగా కాలాతీతం అయిందని, కుటుంబ ప్రభుత్వం ఏర్పడే దాదాపు 20 నెలలో కాలమైనా వేతన సవరణ కమిటీ చైర్మన్ నియమించకపోవడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తుందని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జెఎసి చైర్మన్ ఏ. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. విజయవాడ, వెటర్నరీ కాలనీ లో అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం మందిరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సర్వీసెస్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సాయి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీ. విద్యాసాగర్ మాట్లాడుతూ... పదవి విరమణ చేసిన ఉద్యోగులు సంవత్సరం రకాలముగా పదవీ విరమణ బెనిఫిట్స్ రాకపోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పదవి విరమణ చేసిన వారికి ప్రాధాన్యత క్రమంలో ముందుగా చెల్లింపులు జరపాలని కోరారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల ప్రమోషన్లు తదితర అంశాలపై ఏపీ ఎంజి జీవో సంఘం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించిందని, వాటిపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఇతరులు ఇచ్చిందని, వ్యవసాయ శాఖ ఉద్యోగులు దశాబ్దాల కాలంగా ఏపీ ఎన్జీవో సంఘంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, ఏపీ అంజి జీవో సంఘంలో గత ఐదు దశాబ్దాలుగా మన్నన పొందిన అనేకమంది నాయకులు వ్యవసాయ శాఖ నుంచి వచ్చి ఎన్జీ జీవో సంఘానికి నాయకత్వం వహించారని వేతన సవరణ మరియు కీలక అంశాలలో ముఖ్య భూమిక పోషించారని విద్యాసాగర్ తెలిపారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులకు సంబంధించిన డిపార్ట్మెంట్ సమస్యలు గానీ సర్వీస్ సమస్యలు గానీ మరియు ప్రమోషన్లు అలాగే అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల మంజూరు వంటి సమస్యలపై ఏపీ ఎన్జీ జీవో సంఘం పూర్తి ఇస్తుందని కార్య సాధన దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన పోలీస్ కేసులు ఎత్తివేత, GPF, APGLI చెల్లింపులు, జూరా కంట్రిబ్యూషన్, మెడికల్ బిల్లుల చెల్లింపులు తదితర అంశాలలో గత ప్రభుత్వం బిల్డింగ్ లో పెట్టిన బకాయిలు మంజూరు విషయంలో సానుకూలత ఉన్నప్పటికీ పదవీ విరమణ చేసిన ఉద్యోగుల గ్రాట్యుటీ మరియు సరెండర్ లీవులు చెల్లింపు, అలాగే సర్వీసులో ఉన్న ఉద్యోగులకు సంబంధించి గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవుల చెల్లింపు ప్రక్రియ కూడా ప్రారంభం కావాలని కోరారు. ఉద్యోగులు పిఆర్సి కమిటీ విషయంలో అలాగే సరెండర్ లీవుల చెల్లింపు విషయంలో పూర్తి అసంతృప్తిగా ఉన్నారని, రెండు సంవత్సరాల కాలం అయినా కొట్టుమి ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించకపోవడం సబబు కాదని అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అనేక విషయాల మీద సానుకూలంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, ఈ విషయాలు మీద కూడా దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ నుంచి ఎన్జీవో సంఘ ఆఫీస్ బేరర్స్ గా ఈ మధ్యనే జరిగిన ఎన్నికలలో ఎన్నికైన నాయకులందరికీ విద్యాసాగర్ చేతుల మీదుగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ సాయి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు డి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి పి రమేష్, గుంటూరు జిల్లా ఎన్జీవో సంఘ కార్యదర్శి శ్యాంసుందర్, కర్నూలు జిల్లా ఎంజి జీవో సంఘ జిల్లా కార్యదర్శి కాశన్న, విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు సివిఆర్ ప్రసాద్ కార్యదర్శి నజీర్, వ్యవసాయ శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు డి ఎస్ ఎన్ శ్రీనివాస్, లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని పరిచయం చేసిందే టిడిపి....

## -ఆవిర్భావ దినోత్సవం లో శాసనసభ్యులు కాగిత



**పెడన,మార్చి 29 (వార్తాప్రభ) :** తెలుగు ప్రజలకు సంక్షేమాన్ని పరిచయం చేసిందే తెలుగుదేశం పార్టీ అని శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు పెడన తెలుగుదేశం పార్టీ ఆఫీస్ లో ఆదివారం నాడు 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిడిపి జెండా ఎగరవేసిన అనంతరం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన పార్టీ...టీడీపీ సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్ళ' అనే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతున్నాం. యుగ పురుషుడు ఎన్టీఆర్ లాంటి మహనీయుల స్ఫూర్తితో సాగుతున్నాం అని అన్నారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి నందమూరి తారక రామారావు కాగిత వెంకట్రావు చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించి తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని సీనియర్ టిడిపి కార్యకర్తలను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి వారితో కలిసి భోజనం చేశారు. కృష్ణ ప్రసాద్ ని కూడా నాయకులు సత్కరించారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు జడ్పిటిసి అర్జా నగేష్ మున్సిపల్ మాజీ ఇంచార్జ్ చైర్మన్ హన్ను సెలపాటి ప్రసాద్ పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి-చింతల సీతారామయ్య





**పెనుగంచిప్రోలు,మార్చి 29 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ పెనుగంచిప్రోలు మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య, మాజీ ఎంపిపి, వేగినేటి గోపాల కృష్ణ మూర్తి, మాజీ జెడ్ పిటిసి గజ్జి కృష్ణ మూర్తి యాదవ్, సోసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్ కాకాని శ్రీనివాసరరావు,ముఖ్య అధితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాతసినిమా హాల్ సెంటర్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుండి శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం దగ్గరలో వున్న ఎన్ టీ ఆర్ విగ్రహం వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు.అక్కడ నుండి ర్యాలీగా మాలపల్లి లోని తెలుగుదేశం పార్టీ దిమ్మ పై మండల స మై ఖ్య అధ్యక్షురా లుకర్ల కోటేశ్వరి జెండా ను ఎగుర వేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి 44 ఏళ్ల ప్రయాణం చేసిన కార్యకర్తల ను ఈ సందర్భంగా పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకులు గజ్జి కృష్ణ మూర్తి, తుమాటి చెన్నయ్య, నల్లమోలు నారాయణ, నల్లూరి వెంకటేశ్వరరావు ను ఘనంగా సన్మానించి వారికి దుస్తులు అందజేశారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ 1982 మార్చి 29న స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగుజాతికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారని తెలిపారు. ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రాజకీయాలనే కాకుండా జాతీయ రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. లోకసభలో ప్రధాన ప్రతిపక్షంగా పనిచేసిన తెలుగుదేశం పార్టీ, దేశంలో కాంగ్రేసేతర ప్రభుత్వాల ఏర్పాటులో కూడా ముఖ్యపాత్ర పోషించిందన్నారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాజకీయం సామాన్య ప్రజల ముంగిటికి చేరిందని, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించబడినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి పార్టీ విశేష కృషి చేసిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పగా, నారా చంద్రబాబు నాయుడు తెలుగువారి మేధస్సును ప్రపంచానికి పరిచయం చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. అలాగే నారా లోకేష్ ప్రజల మధ్య పాదయాత్ర చేసి వారి సమస్యలను తెలుసుకొని, పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఆదుకుంటున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్ కుమార్,చుంచు రమేష్ బాబు,కర్ల నాగేశ్వర రావు, నల్లమోలు నారాయణ,కల్లూరి వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు, నల్లపునేని కొండ,తెలుగు మహిళా సూ ర్య కుమారి,షేక్ మహమ్మద్ అజాద్,పెనుగొండ కొండలు,గేరా సుభారావు, బడిశా చిన్న మీరయ్య, కంభం చిరాంజీవి,పొట్ట పింజరు రాము, బుద్ధా రమణ,యలమందల శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 30న పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,మార్చి 29 (వార్తాప్రభ) :** ఈ నెల 30వ తేదీ సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం ... పబ్లిక్ (గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపడుతున్నట్టు తెలిపారు. కలెక్ట రేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా డివిజనల్, మండలస్థాయిలో రెవెన్యూ క్లినిక్ లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజలు తమ రెవెన్యూ అర్జీలను ఈ క్లినిక్‌లలో అందజ ేయాలని సూచించారు. అర్జీదారులు తమ అర్జీలను Meekosam. ap.gov.in వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

# జి.కొండూరు లో ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

● ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన టీడీపీ నేతలు ● గ్రామ పార్టీ అధ్యక్షుడు పజ్జూరు విజయ్ ఆధ్వర్యంలో అన్నదానం





**జి.కొండూరు,మార్చి 29 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామంలోని పీర్ల పంజా సెంటర్ లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జూరు విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పజ్జూరు విజయ్ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు దివంగత నేత ఎన్టీఆర్ ఆశయాలను స్మరించుకుంటూ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీని స్థాపించి పేద,బడుగు బలహీన



వర్గాల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరువలేనివి అని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కోసం సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. అనంతరం విజయ్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు.పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలను సన్మార్గములో నడిపించటానికి యేసు ఈ లోకములో జన్మించారు -చర్చ్ ఫాదర్ కె.అనిల్ ఫ్రాన్సిస్

● మైలవరంలో భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం జరుపుకున్న క్రైస్తవులు





**మైలవరం,మార్చి 29 (వార్తాప్రభ) :** మనిషి దేవుని యందు భయభక్తులు లేకుండా పాపములో నశించిపోతున్నాడని అందుకే ప్రజలను సన్మార్గములో నడిపించటానికి యేసు ఈ లోకములో జన్మించారని మైలవరం పట్టణంలోని శాంతినగర్ ఆర్ సీ యం చర్చ్ ఫాదర్ కె.అనిల్ ఫ్రాన్సిస్ వెల్లడించారు.మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్దలతో ఆదివారం ఘనముగా జరుపుకున్నారు.యేసు విధేయత సేవక రూపమును దాల్చి ప్రేమ సేవ కలిగిన రాజ్యముగా తీర్చిదిద్ది ఆ రాజ్యానికి తన్నుతాను అట్టి రాజ్యానికి తను రాజుగా ప్రకటించుకున్నారని ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ చెప్పారు.అందువలనే యేసు సేవక రూపంలో సాధారణ వ్యక్తిత్వంతో వినమృడై ఎరుషలేము పురవీధుల్లో ప్రవేశించి గాడిదపై కూర్చుని సంచరిస్తుండగా అక్కడి ప్రజలు కొబ్బరి మట్టలు, ఈతకొమ్మలు చేభూని “దావీదు కుమార హోసన్నా” అని కీర్తిస్తూ ఎలుగెత్తి స్తుతించారని తెలిపారు.ఆనాటి సందర్భాన్ని పురస్కరించుకొని భక్తి గీతాలు ఆలపిస్తూ శాంతినగర్ వీధుల్లో ఈత మట్టలతో క్రైస్తవ భక్తులు ప్రదక్షిణలు జరిపారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉపదేశకులు,దీక్షాపరులు, మరియదళసభ్యులు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188